నవతెలంగాణ

మహబూబ్‌నగర్

శుక్రవారం | సెప్టెంబర్ 06, 2024 | www.navatelangana.com

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత



నవతెలంగాణ - బాలానగర్

జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలో వెన్నెల కల్చరల్ అకాడమీ కళాకారులు గురువారం బాలనగర్ మండలంలోని ఉడిత్యాల గ్రామంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద కళాకారులు ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు పాటలు పాడుతూ పల్లె సుద్దుల ద్వారా అవగాహన కలిగించారు. నాలుగు రకాలుగా హెచ్ ఐ వి సోక్తుందని కల్పితమైన రక్తమార్పిడి ద్వారా కలుషితమైన సూది సిరంజిల ద్వారా హెచ్ఐవీ సోకిన తల్లి ద్వారా సురక్షితం కానీ లైంగిక సంబంధాల ద్వారా ఇత రులకు సోకుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లేష్ యాదవ్ , కల్చర్ అకాడమీ కళాకారులు రవిశంకర్ , నరసింహులు, యాదయ్య , ఝాన్సీ , స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పంపిణీ



నవతెలంగాణ - హన్వాద

మండలంలోని బుద్దారం గ్రామంలో ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతు సోదరులకు 20 పండ్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐసీఐసీఐ ప్రతినిధులు రాయుడు , ప్రకాష్ , రవికుమార్ మాట్లా డుతూ ప్రతి ఇంటికి 20 పండ్ల మొక్కలను పంపిణీ చేయడం వల్ల కుటుం బాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. పలు రకాల పండ్ల మొక్కలు పెంచడం ద్వారా ఆ కుటుంబానికి ఎంతో ఆర్థిక స్వాలంబన కలుగు తుందని, అంతేకాక పండ్ల వల్ల కుటుంబంలో ఎంతో అయురారోగ్యాలు ఉంటాయని అన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఇచ్చిన పండ్ల మొక్కలను నాటి వాటిని సంరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి రాఘవేందర్, ఐసీఐసీఐ ఫౌండేషన్ ప్రతినిధులు కిష్టయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టీ సాగర్



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అతి భారీ వర్షాల వల్ల నష్టపోయిన బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టీ సాగర్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హాజరై మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాల కారణంగా పట్టణాలు, గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయని, చెరువులు, కుంటలు, వాగులు , వంకలు విపరీ తంగా పొంగి పొర్ల డంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువులు కుంటలు తెగిన దగ్గర రైతుల భూములు మూడు నుంచి నాలుగు ఫీట్ల ఇసుక, వరద, బురద మట్టి పేరుకుపోయినట్లు తెలిపారు. వందలాది ఎకరాల్లో వరి, పత్తి తదితర పంటలు నష్టపోయారని, పెట్టిన పెట్టుబడి చేతికి అందక ముందే కళ్లముందే పంటలు నాశనం కావడంతో తీవ్ర నిరాశతో రైతులు ఉన్నారని అన్నారు. యుద్ధ ప్రాతిపదికన రైతులను ఆదుకో వాలని , ఎకరాకు రూ. 25 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమా ండ్ చేశారు. ప్రభుత్వమే పొలాల్లోని మేట బురద ఇసుకను తొలగించాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) జిల్లా జిల్లా కార్యదర్శి ఏ. రాములు మాట్లా డుతూ మిడ్జిల్ మండలంలోని గ్రామాలు కోయిలకొండల మండలంలోని గ్రామాల్లో జిల్లాలోని అనేక ప్రాంతాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారని రైతులను ఆదుకొని తక్షణమే రైతు భరోసా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) జిల్లా సీనియర్ నాయకులు కిల్లే గోపాల్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పట్టణం జడ్చర్ల, బూత్పూరు, దేవరకద్రలో కని విని ఎరుగనిరీతిలో వర్ష బీభత్సానికి ప్రజలు గురయ్యారని, మహబూబ్‌నగర్లో పలు చెరువులు నీటి ప్రవాహం ఉధృతంగా ఇళ్లల్లోకి రోడ్ల మీదికి వచ్చి ప్రజలు భయ భ్రాంతుల కుగురయ్యారని మహబూబ్‌నగర్ పట్టణంలో నిపుణులతో అధ్యయనం చేయించి, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విష జ్వరాలు తదితర వ్యాధులు ప్రబల కుండా మొబైల్ టీంలు, మెడికల్ క్యాంపులు విస్తృతంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నల్లవెల్లి కురుమూర్తి ,బీ చంద్రకాంత్ ,వీ పద్మ , రాజ్‌కుమార్, కడియాల మోహన్, లక్ష్మయ్య ,జగన్ తదితరులు పాల్గొన్నారు.

జూరాలలో ఆరుగేట్లు ఎత్తివేత



నవతెలంగాణ - ధరూర్

జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు గురువారం అధికారుల సమాచారం మేరకు కర్ణాటక ప్రాంతంలో ఆలుమట్టి నారాయణపూర్ డ్యామ్ నుంచి స్వల్పంగా వరదనీరు తగ్గడంతో జూరాలలో కూడా స్వల్పంగా తగ్గింది. అదే తరుణంలో ఎగువ ప్రాంతం నుంచి జూరాలకు వచ్చి చేరుతున్న వరద నీరు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో ప్రాంతం నుంచి 82వేల క్యూసెక్కుల నీరు రాగా ప్రాజెక్టులో 6క్రస్ట్ గేట్లు ఎత్తి శ్రీశైలం జలాశయంలోనికి 41వేల 736 నీరు గేట్ల ద్వారా వదులుతున్నారు 4.576 టీఎంసీల నీటిమట్టం ఉన్నట్లు జల విద్యుత్ కేంద్రం ద్వారా ఐదు యూనిట్లలో 36 వేల 526 క్యూసెక్కుల నీటిని కరెంటు ఉత్పత్తికి వాడుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి 317.860 నీటిమట్టం ఉన్నట్టు అధికారులు తెలిపారు . లెఫ్ట్ కెనాల్‌కు 290 రైటు కెనాల్‌కు 3, 185క్యూసెక్కుల వదులుతున్నారు. శ్రీశైలం జలాశయంలోనికి కాలువలకు 79వేల 560 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

ఆల్ మేవా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ..
సయ్యద్ వహిద్ షా



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లా కేంద్రానికి చెందిన సయ్యద్ వహీద్ షా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫారూఖ్ హుస్సేన్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. వహీద్‌షా ప్రస్తుతం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కొనసా గుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఆల్ మేవా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకం చేసినందుకు రాష్ట్ర అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘాన్ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ షేక్ ఫరీద్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియామకం అయ్యారు.

వయోవృద్ధుల వైద్య శిబిరం విజయవంతం



నవ తెలంగాణ - ఊట్కూర్

నేషనల్ ఆయుష్ మిషన్ ఆధ్వర్యంలో మండలంలోని చిన్నపొర్ల గ్రామంలోని రైతు వేదికలో గురువారం జీరియాట్రిక్ ప్రత్యేక వయోవృద్ధులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు వయో వృద్ధులకు అన్ని రకాల ఆరోగ్య సమస్యలను పరీక్షించి, ఉచితంగా మందులు అందించారు. 85 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 6 గురుకి హైదరాబాద్ ఆయుష్ హాస్పిటల్ కు రిఫర్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శైలజ రెడ్డి , ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ ఫార్మసిస్ట్ సాయిబాబా , జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేష్ నాయక్, స్థానిక మాజీ సర్పంచ్ మాలి పటేల్ రవీందర్ రెడ్డి, వైద్య సిబ్బంది చంద్రయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్‌లో ఇండ్లు ..
బఫర్‌జోన్‌లో పంట పొలాలు

- అలుగులు ధ్వంసం చేసి..
తూములు తీసేసి ర్మాణాలు
- పాలమూరు గడ్డ అక్రమణ పుట్ట
- చెరువులు చెరబట్టి కాల్వలను ప్లాట్లుగా మార్చి
- నీటి నిల్వ లేక..దారి అడ్డంగా బంగ్లాల వలన
మునిగిపోతున్న గ్రామాలు, పట్టణాలు



నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

ఊరిపక్కన చెరువు గ్రామాలక ఆదెరువు అన్న మాట క్రమంగా కనుమరుగు అవుతోంది. గ్రామాల సమీపాన ఉన్న చెరువు అటు గ్రామ ప్రజలకు ఉపాధి, మూగ జీవాలు పశుపక్షాదులకు జీవనాదారంగా నిలిచేది. నేడు అపరిస్థితులు మాయమయ్యాయి. కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువుల తూములను ధ్వంసం చేసి శిఖంను కబ్జా చేసి విల్లాస్‌లు నిర్మించుకుంటున్నారు. మరి కొందరు అలుగులు తీసేసి నీటి తోడేసి ఏక్‌సాల్ పట్టా భూములను సాగు భూములుగా మార్చుకుంటున్నారు. కోర్టు తీర్పు చెప్పినా పట్టించుకోవడం లేదు. చెరువులను కాపాడాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వల్ల ఉమ్మడి పాలమూరు జిల్లాలో కుంటలు, చిన్న చెరువులు కనుమరుగవుతున్నాయి. చెరువులను చెర బట్టిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకొని గ్రామాలకు ముంపుగా మారిన చెరువులు పునరుద్దరణ చేయాలని పలు ఆర్టీలు ప్రజాసంఘాల వారు కోరుతున్నారు. చెరువులో నీళ్ల నిల్వ ఉండాల్సిన శిఖం భూమిలో పెద్ద విల్లాసాలు వెలుస్తున్నాయి. సాగుకు నిషేధంగా ఉన్న బఫర్‌జోన్‌లో పంట పొలాలు సాగు చేసుకుంటున్నారు. ముఖ్యంగా అత్యధికంగా వరదలు వచ్చినప్పుడు పారే అలుగులను ధ్వంసం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని కేసరి సముద్రం అలుగును కొంత మంది రియల్ వ్యాపారులు రాత్రికి రాత్రే కూల్చేశారు. బఫర్‌జోన్‌లో నిర్మించుకున్న తన విల్లాస్‌ను కాపా డుకోవడానికి ఆయన జేసీబీ తెచ్చి అలుగు కూల్చి వేశాడు. ఇది అధికారులతో పాటు అన్ని రాజకీయ పార్టీల నాయకులకు తెలుసు. అయినా... పట్టించుకునే నాథుడే లేడు. ఎఫ్‌టీఎల్‌లో అక్రమంగా నిర్మాణాలు కేసరి సముద్రంలో 80 దాక ఉన్నాయి. ఇట్టి ర్మాణాల పై గ్రీన్ ట్రిబ్యునల్ కేసు వేస్తే... నిర్మాణాలు తొలగించాలని ఆదే శాలు జారీ చేసినా.. అధికారుల అండదండలతో నిర్మాణాలు సురక్షితంగా ఉన్నాయి. దీంతో ఇటీవల కురిసిన బారీ వర్షాలకు నాగర్‌కర్నూల్ సమీప ఇండ్లలో వరద నీరు వచ్చి చేరింది. మహబూబ్‌నగర్ నడిబొడ్డున ఉన్న పెద్ద చెరువు చుట్టూ అక్రమాలే. కొందరు రియల్ వ్యాపారులు బడా వ్యాపార వెత్తలు ఇక్కడ శిఖం భూమిలో బఫర్‌జోన్‌లో నిర్మాణాలు చేశారు. అలుగులు ధ్వంసం చేసి తూములు పగల గొట్టి చెరువు సామర్థ్యాన్ని తగ్గించారు. దీంతో 100 ఎకరాలకు పైగా ఉండాల్సిన చెరువు 50 ఎకరాలకు కుచించుక పోయింది. 100కు పైగా అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. బఫర్‌జోన్ పరిదిని నిర్ధారించినా.. ఇక్కడ అక్రమ నిర్మాణాలు ఆగడం లేదు. ఇక్కడ నీటి నిల్వ తగ్గి కిందిబాగానే ఉన్న ఆవాసాలకు నీరు వచ్చి చేరుతోంది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రాలలోనే పుట్నాల కంట ఊరచెరువు వంటి 15 కుంటలు మాయమయ్యాయి. ఈ కుంటల నీళ్లన్నీ జన వాసాలకు వచ్చి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లాలో 2271 చెరువులు ఉన్నాయి. ఇందులో 126 చెరువులు మాయమయ్యాయి. శిఖం భూములన్నీ బడా రైతులు అక్రమించుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 1739 చెరువులకు గాను 102 చెరువుల ఆచూకి లేకుండా పోయింది. ఇక వనపర్తి జిల్లాలో 1665 చెరువలకు గాను 85 చెరువులు గద్వాల 1500 చెరువులకు గాను 87 చెరువులు, నారాయణపేటలో 1250 చెరువులకు గాను 56 చెరువులు మాయమయ్యాయి. శిఖం భూములు మొత్తం సాగు భూములుగా మార్చుకున్నారు. ఇలా సాగు భూములుగా మార్చడం వల్ల నీటి నిల్వ తగ్గి వర్షాల సమయంలో గ్రామాలపైకి వరదలు వస్తున్నాయి. చెరువులను చెరబట్టి శిఖంను కబ్జాలకు పాల్పడుతున్న వారిపట్ల చర్యలు తీసుకోవాలని పలు పార్టీలు , ప్రజాసంఘాలు కోరుతున్నారు.

చెరువు, అలుగు ధ్వంసం చేయకుంటే వరదలు వచ్చేవి కావు..

నేను 50 ఏళ్లుగా చూస్తున్నాను. ఈ చెరువు నీళ్ల ఇక్కడి సాగు భూములకు మళ్లించేవారు. ఇప్పుడు లోపల శిఖం బయట ఆయకట్టు అంతా కబ్జాకు గురైంది. చెరువులో నీటి నిల్వ లేకపోవడం వల్ల వరదలు వస్తే...పట్టణంలోకి వచ్చి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికైనా శిఖం భూములనుగుర్తించి ప్రభుత్వం సాధీనం చేసుకోవాలి.

- శంకర్, మహబూబ్‌నగర్

అక్రమణలను తొలగించి నీటికి దారి వదలాలి..

జిల్లా కేంద్రంలో ఉన్న పెద్ద చెరువు ఈ ప్రాంతానికి ఆదెరువుగా ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. చెరువు శిఖం మొత్తం అక్రమణకు గురైంది. బఫర్‌జోన్‌లోని భూములు సైతం కబ్జా చేసుకున్నారు. కబ్జా దారులు అధికారులు, నాయకులకు తెలుసు. వారం రోజుల క్రితం వచ్చిన బారీ వర్షాలతో పట్టణం అంతా జలమయమైంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోని న్యాయం చేయాలి. లేనిచో పట్టణ ప్రజల అగ్రహానికి గురికాక తప్పదు.

- ఎ. రాములు, సీపీఐ(ఎం)
జిల్లా కార్యదర్శి, మహబూబ్‌నగర్





తల్లిదండ్రుల తర్వాత గురువులదే అగ్రస్థానం

- కలెక్టర్ విజయేందిర బోయి



మహబూబ్ నగర్‌లో..

నవ తెలంగాణ - మహబూబ్ నగర్

గురువులను దైవంగా భావించే సంస్కృతి మనదని, తల్లిదండ్రుల తర్వాత గురువులదే స్థానం అని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవానికి కలెక్టర్ హాజరై మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటామని అన్నారు. గురువులు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని అన్నారు. ఉపా ధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారందరూ ఉత్తమ పౌరులుగా తయారయ్యేలా చూడాలని అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన, కమ్యూనికేషన్ స్కిల్స్, హ్యాండ్ రైటింగ్, వ్యక్తిగత పరిశుభ్రత, పెద్దలను గౌరవించే విధానాలను వారికి నేర్పాలని ఆకాంక్షించారు. ఇంట్లో తల్లితండ్రులు చెబితే పిల్లలు అంతగా గుర్తించుకోరని, కానీ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు ఏం చెప్తే అది విద్యార్థులు ఎక్కువ కాలం గుర్తుంచుకుని దానిని పాటిస్తారని అన్నారు. ప్రైమరీ టీచర్లకు చాలా ఓపిక, సహనం ఉండాలని, విద్యార్థుల భవిత, భవిష్యత్ ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. ఒక విద్యార్థి మొదటగా పాఠశాలలో చేరినప్పుడు ఏవైతే నేర్చుకుంటారో అది ఎల్లకాలం గుర్తించుకుంటూ నేర్చుకున్న క్రమశిక్షణ, చదువు వంటివి హై స్కూల్ / కళాశాల దశలో వారికీ అలవాటు అవుతుందని అన్నారు. మా నాన్న ఉపాధ్యాయుడిగా ఎన్నో సంవత్సరాలు విద్యానందించి పాత్రికేయుడిగా అలాగే కవిగా పనిచేశారని, మాఅమ్మ టీచర్ గా ఎన్నో సంవత్సరాలు విద్యార్థులకు విద్యానందించారని తెలిపారు. జిల్లాలో తను పర్యటించే ప్రాంతంలోని దగ్గరగా ఉన్న కేజీబీవీ లేదా పాఠశాలలకు తప్పకుండా వెళుతున్నానని, అక్కడ విద్యార్థినీ, విద్యార్థులతో మాట్లాడి అక్కడ వారి చదువు, విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, ఇతర అంశాలపై వారిని అడిగి తెలుసుకుంటున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 38 మంది ఉపాధ్యాయులను శాలువా, మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రవీందర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి ఉమామహేశ్వర్, ఈ.ఈ. హౌసింగ్ వైద్యం భాస్కర్, జిల్లా వెల్ఫేర్ అధికారి, ఎ.డీ. అనసూయ, ఎ.ఎం.ఓ. శ్రీనివాసులు, సీ.ఎం.వో. బాలు యాదవ్, మానిటరీ ఆఫీసర్ సంపత్, ఎం.ఈ. ఓ లు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్ నగర్‌లో..

ఎన్టీఆర్ కళాశాలలో..

ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళ డిగ్రీ అండ్ పీజీ అటానమస్ కళాశాలలో ప్రిన్సిపాల్ , అధ్యాపకులు గురువారం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. న్యూ టౌన్ లోని రాజేంద్రనగర్ బ్రాంచ్ కి చెందిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ వీరా లక్ష్మి, డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, బ్యాంకు సిబ్బంది కూడా కళాశాలలోని అధ్యాపకులందరినీ పెన్ను, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతి గురువు, శిష్యులు తనకన్నా ఉన్నతమైన స్థానంలో ఉండాలని, సమాజంలో గౌరవాన్ని దక్కించుకుంటే అదే తమకు గర్వకారణమని భావిస్తారని అంటూ అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని అందించే అవకాశం ప్రపంచంలో ఒక్క ఉపాధ్యాయులకే దక్కుతుందని అన్నారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు మమతాను బంధం ఉండాలని సూచించారు. భావి పౌరులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు.అలాగే వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ అనురాధ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన ఉన్నతికి కారకులైనా గురువులను సత్కరించడం మంచిదని గురు శిష్యుల బంధం పవిత్రమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ , సైన్సెస్ విద్యార్థినిలు అధిక సంఖ్యలో పాల్గొని అధ్యాపకులను ఘనంగా సన్మానించారు.

నవ తెలంగాణ - మిడ్జిల్

సమాజ నిర్మాణం దేశ భవిష్యత్ తరగతి గదిలో రూపు దిద్దుకుంటుందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నర్సింలు అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని మండల వనరుల కేంద్రం దగ్గర ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలో పాటు అన్ని ప్రభుత్వ పాఠశాలలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుడు నిరంతరం అధ్యయనం చేస్తూ విషయాలను తెలుసుకుంటూ విద్యార్థులకు అందించి, వారిని చైతన్యం చేయాల్సిన ఆవశ్యకత ప్రస్తుత సమాజంలో ఎంతైనా ఉందని అన్నారు .ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సీ. వెంకటయ్య , ప్రధాన కార్యదర్శి కే. రమేష్ , జానకమ్మ ప్రభావతి, ప్రియాంక, పరిమళ, మద్దమ్మ, లక్ష్మయ్య హర్యా, నర్సిములు , మోహన్ రెడ్డి , ఎంఆర్పి సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ జడ్చర్ల

జడ్చర్ల మండలం ఖానాపూర్ గ్రామంలో గ్రామయువకుల ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఖానాపూర్ గ్రామ ప్రధానోపాధ్యాయులు శ్రీశైలం ఉపాధ్యాయులు శివకుమార్ , రవీందర్ రెడ్డిలను గ్రామ యువకులు యాదగిరి , శివకుమార్ ,శేఖర్ , శ్రీనివాస్ ,రాజేందర్ , రాజు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మంచి చదువుకొని ఈ సంవత్సరం వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు.



జడ్చర్లలో..



మిడ్జిల్‌లో..

అన్నదానం



నవతెలంగాణ - హన్వాద

కాశిరెడ్డి నాయన జ్యోతి క్షేత్రం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ కిష్టనాయక్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆకలి తీర్చడం ఎంతో పుణ్యమని అన్నారు. ఈ సేవ కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. అన్న దానం ప్రతి గురువారం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీపీ బాలరాజ్ , మాజీ సర్ప ంచ్ లక్ష్మీనారాయణ , రాములు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాశిరెడ్డి నాయన ఆశీస్సులతో సమాజ సేవలో భాగంగా అన్నదాన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఈ అన్న దాన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భక్తులు సాయిలు , ఎర్రన్న, భక్తబృందం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు పూర్తి



నవతెలంగాణ - హన్వాద

మండలంలోని ఇబ్రహీంబాద్ గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న రెండు బ్రిడ్జీల దగ్గర భారీ వర్షాలకు రోడ్లు తెగిపోయాయి. దీంతో ఆరు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. రవాణా సౌక ర్యాలు లేక దూర ప్రాంతాల ప్రయాణికులకు ఇబ్బందిగా ఉండేది. అత్యవసర సేవలు పొందేందుకు వీలు లేకుండా పోయింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ..రోడ్డు మరమ్మతుల పనులు యుద్ధ ప్రాతిపదికన 167 అధికారులు ప్రారంభించారు. మట్టి రోడ్డు ఏర్పాటు చేసి వాహనాలు వెళ్లేందుకు సిద్ధం చేశారు. రోడ్డు నిర్మాణం పూర్తి కాకముందు తిరుమలగిరి పులి పోనిపల్లి ఇబ్రహీ ంబాద్ , తిరుమలగిరి గ్రామాల ప్రజలు వెళ్లేం దుకు అవకాశం లేకుండా పో యింది. ఈ రోడ్డు నిర్మాణం పూర్త యిన తర్వాత బస్సులు వెళ్లేందుకు అవకాశం ఉండడంతో పలు గ్రా మాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



నవతెలంగాణ-వనపర్తి

మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం పెబ్బేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత ప్రార్థన చేయించి వ్యక్తిగత పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. వసతి గృహం గదులు, పరిసరాలను పరిశీలించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకో వాలని సూచించారు. విద్యార్థులకు జ్వరం లక్షణాలు ఉంటే వెంటనే ప్రాథమిక వైద్య కేంద్రానికి తరలించి చికిత్స అందించాలని వసతి గృహ సంక్షేమ అధికారి అమృత సాగర్, సిబ్బందిని ఆదేశించారు.

గణేష్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

- ఆత్మకూరు ఎస్సై నరేందర్



నవతెలంగాణ- ఆత్మకూరు

ఆత్మకూరు మండలంలో గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు అనుమతులు తప్పని సరి అని ఎస్సై నరేందర్ నిర్వాహకులకు సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండపాల నిర్వాహకులు గణేష్ విగ్రహాల ఏర్పాటు కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని అనంతరం ప్రింట్ కాపీ పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని, పర్యావరణ పరిరక్షణకు మట్టివి నాయక విగ్రాహాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మండపాల వద్ద తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని, వర్షాలు కురుస్తునందున విద్యుత్ తీగలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వర్షాలతో కూలిన ఇండ్లను పునర్నిర్మించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండీ. జబ్బార్



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

నవతెలంగాణ-వనపర్తి

భారీ వర్షాలతో కూలిపోయిన ఇండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునర్నిర్మించాలని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి ఎం.డీ జబ్బార్ డిమాండ్ చేశారు. గురువారం పాన్‌గల్ మండలం రేమద్దుల గ్రామంలో సీపీఎం బృందం పర్యటించి భారీ వర్షాలతో కూలిన ఇండ్లు, దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జబ్బార్ మాట్లాడుతూ వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో గ్రామంలో అనేక పాత ఇండ్లు కూలిపోయాయని బాధితులకు వెంటనే ప్రభుత్వం ఇండ్లను పునర్నిర్మించి ఇవ్వాలన్నారు. అలాగే ఏదుట్ల నుండి రేమద్దుల వరకు తెగిపోయిన రోడ్డును మరమత్తు చేసి డబుల్ రోడ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టకపోవడంతో రవాణా సౌకర్యం పూర్తిగా దెబ్బతిన్నదని అన్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని బాధితులకు నష్టపరిహారం ఇచ్చి ఇండ్లను నిర్మించాలని, తెగిపోయిన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.వెంకటయ్య జి.వెంకటయ్య, భాస్కర్, ఆర్.నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గోపాల్




పంటలు పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

నవతెలంగాణ-వీపనగండ్ల

పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు వంక గోపాల్ డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని బొల్లారం, కొర్లకుంట గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలో వందల ఎకరాల్లో వేరుశనగ, వరి ఇతర పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయార్నారు. ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ, వ్యవసాయాధికారులు పంటలను పరిశీలించి నష్టం అంచనా వేయాలన్నారు. బొల్లారం గ్రామంలో చిన్న గోవిందు, పెద్ద గోవిందు మట్టిమిద్దె ఇండ్లు కూలిపోయాయన్నారు. వర్షానికి తెగి పోయిన కాలువలను, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎం.కురుమయ్యచల్మారెడ్డి, వినోద్, యాదగిరి, శివ, గోవిందు మహిళా సమైక్య నాయకురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న మునగతోట

- రైతులకు భారీ నష్టం



నవతెలంగాణ- వీపనగండ్ల

భారీ వర్షంతో మండలంలో రైతులు సాగు చేసిన మునగ తోటలు దెబ్బతిని తీవ్ర నష్టం వాటిల్లింది. మండల కేంద్రానికి చెందిన పెబ్బేటి మహేష్, రాఘవేంద్ర గ్రామంలో ఓ రైతు నుంచి ఎకరాకు రూ.10వేల చొప్పున ఏడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని మునగ తోట సాగు చేశారు. పంట సాగుకు ఇప్పటికే రూ.రెండు లక్షల ఖర్చు చేయగా ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీరు వచ్చి తోటలో నిల్వ ఉండంతో పంట కుళ్లి పోతుందన్నారు. నీళ్లు వెళ్ళేందుకు కాలువలు తీసినా ఫలితం లేదన్నారు. రెండు నెలలైతే పంట చేతికి వచ్చేదని రైతులు వాపోయారు. పంట కుళ్లి పోవడంతో తాము తీవ్రంగా నష్టపోయామని అధికారులు తోటను పరిశీలించి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

కూలిన ఇండ్ల పరిశీలన

నవతెలంగాణ-ఆత్మకూర్

ఆత్మకూరు మండల పరిధిలోని జూరాల గ్రామంలో ఇటీవల వర్షాలకు కూలిపోయిన ఇళ్లను గురువారం రాష్ట్ర నాయకుడు బంగ్లా లక్ష్మి కాంత్‌రెడ్డి పరిశీలించినట్లు ఆత్మకూరు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విని కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షల్లో కూలిపోయిన, పడిపోయిన ఇళ్లకు పార్టీ తరపున ఆదుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పిన్నెంచెర్ల మనోహర్ గౌడ్, బోరెల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై బెల్టులు పంపిణీ

నవతెలంగాణ-ఆత్మకూర్

ఆత్మకూరు మండల పరిధిలోని జూరాల గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దుర్గా కమిటీ ఆధ్వర్యంలో టై, బెల్టులు పంపిణీ చేసినట్లు ఉపాధ్యాయుడు ఉమా శంకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మహేశ్వరమ్మ, మాజీ చైర్మన్ బాలరాజు, దేవల్ల కురుమూర్తి, వెంకటేష్, అయ్యప్ప, తెలుగు రాము తదితరులు పాల్గొన్నారన్నారు.

నేడు అతిథి అధ్యాపకులకు మౌఖిక పరీక్ష

నవతెలంగాణ -వనపర్తి రూరల్

వనపర్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం డెమో, మౌఖిక పరీక్ష నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.ఈశ్వరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ విధిగా మౌఖిక పరీక్షకు నిర్దిష్ట సమయంలోగా హాజర కావాలని పేర్కొన్నారు.

సమాజ మార్పులో విద్యదే అగ్రభాగం

- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి: ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి
- విద్యకు మొదటి ప్రాధాన్యత: కలెక్టర్ సురభి
- ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిన్నారెడ్డి, కలెక్టర్ సురభి

నవతెలంగాణ-వనపర్తి

సమాజ పరివర్తనలో విద్య అగ్రభాగాన ఉంటుందని అలాంటి విద్యనందించే ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేసి సమ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఉద్బోధించారు. గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో స్థానిక కళ్యాణసాయి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా.జి.చిన్నారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయ వృత్తి నుండి రాష్ట్రపతి హోదాకు చేరుకున్నారన్నారు. మనిషి తనకు తాను సంస్కరించుకొని సమాజ పురోభివృద్ధికి పాటు పడే విధంగా ఉత్తమ వ్యక్తులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి పాఠశాలలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. మధ్యతరగతి కుటుంబాలు తమ పిల్లను లక్షల వెచ్చించి ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తూ ఆర్థికంగా చిన్నాభిన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోలే మెరుగైన విద్య అందుతుం దన్నారు. తనకు వచ్చే రూ.10కోట్ల బడ్జెట్‌తో పాటు సీఎస్ఆర్ ఫండ్ సైతం విద్య, వైద్యానికే ఖర్చు చేయాలని కలెక్టర్ సూచించారు. ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేస్తూ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచాలని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన సర్వేపల్లి రాధాకృష్ణ కష్టపడి చదివి ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకొని రాష్ట్రపతిగా పనిచేశారని కొనియాడారు. ఉపాధ్యాయులు సర్వేపల్లి స్ఫూర్తితో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు.వనపర్తి జిల్లాను విద్యలో అగ్రభాగాన నిలిపేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద దాదాపు 500 పాఠశాలల్లో రూ. 13.50 కోట్లతో మౌలిక వసతులు కల్పించిందన్నారు. ఉపాధ్యాయుల నుంచి సమాజం ఎంతో ఆశిస్తుందని విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించాల్సిన బాధ్యత వారిదేనన్నారు. తమ బాధ్యతలను విస్మరించకుండా విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలన్నారు. విద్యార్థులకు పాఠాలు భట్టి పట్టేవిధంగా కాకుండా అర్ధమయ్యే విధంగా బోధించాలని సూచించారు. అనంతరం జిల్లా నుండి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 52 మందికి మెమోటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈకార్య క్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా విద్యాశాఖ అధికారి గోవింద రాజులు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ పి.మహేష్, మోటివేటర్ భాస్కర్ గుప్త, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ఆత్మకూరు: మండలంలోని మూలమల్ల గ్రామంలో ని ప్రభుత్వ మండల పరిషత్ హై స్కూల్‌లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ గురించి వివరించి ఆయనను ఆదర్శంగా తీసుకొని ఉన్నత చదువులు చదివి దేశ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మహేశ్వరమ్మ, అంగన్వాడీ టీచర్ ప్రభావతమ్మ, విద్యా కమిటీ చైర్మన్ సులోచనమ్మ , ఆశా కార్యకర్తలు కవిత ,నవీన, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో..

ఆత్మకూరు పట్టణం వాసవి కాలనీలో పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులు రాఘవేంద్ర రావు, రాజారత్నంలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమలో పూర్వ విద్యార్థులు మొబైల్ ఖాజా, నరసింహ, అంజద్,తులసిరాజు, కిషోర్, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరులో..

పెబ్బేరు: పట్టణంలోని చెంచువాడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు చిన్న రాములు మాట్లాడుతూ విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణను ఆదర్శంగా తీసుకుని భాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మాధురి, ఐఈడీ ఉపాధ్యాయుడు సాయికుమార్, అంగన్‌వాడీ టీచర్ రాధమ్మ ఆయా రాధ, శిరీష, విద్యార్థుల తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం మండలంలో..

మదనాపురం మండల కేంద్రంతో పాటు దుప్పల్లి, కొత్తపల్లి, అజ్జకోలు తదితర గ్రామాల్లోని పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదిగితే తాము ఎంతో గర్విస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో సన్మానం

వనపర్తి రూరల్: వనపర్తి జిల్లా కేంద్రంలోని దళితవాడ హైస్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్య క్షుడు చీర్ల విజయచందర్, సమన్వయకర్త లక్కాకుల సతీష్, కౌన్సిలర్లు పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. విజయచందర్ మాట్లాడుతూ సమాజానికి ఉత్తమ పౌరులను అందించే వారు ఉపాధ్యాయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్స్ సత్యమ్మ శరవంద, బి.వెంకటేశ్వర్లు, విభూతి నారాయణ, నక్క రాములు, జంపన్న, పాషా నాయక్, లక్ష్మీ రవియాదవ్, చంద్రకళ ఎల్‌ఐసి కృష్ణ, మాజీ కౌన్సిలర్ కృష్ణ బాబు, మీడియా కోఆర్డినేటర్ డి వెంకటేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూరి, ఆదిత్య శశాంక్, సాగర్ ,ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో..

వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ మాట్లాడుతూ గురువు విద్యార్థులతో స్నేహితుడిగా మెలుగుతూ, సంరక్షకుడిగా, మార్గదర్శకుడిగా సన్మార్గంలో నడిపిస్తే వారు భావిభారత పౌరులుగా తయారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో మండల దేవన్న నాయుడు, బూరోజు గిరిరాజాచారి, బాలేమియా పానుగంటి యూసఫ్, సురభి, శ్రీనివాసరావు, వెంకటేష్, లక్ష్మణ్ గౌడ్, నరసింహ, విజయ్‌కుమార్, పానుగంటి రాములు, ఆది, రఘు, రమేష్‌చారి, విశ్రాంత ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మదనాపురంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థినులు



పెబ్బేరులో సర్వేపల్లికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



వనపర్తిలో ఉపాధ్యాయినులకు సన్మానం



వనపర్తిలో నివాళులర్పిస్తున్న స్ఫూర్తివేదిక సభ్యులు



ఆత్మకూరులో గురువులను సన్మానిస్తున్న విద్యార్థులు



ఆత్మకూరులో గురువులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు



వనపర్తిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహిళల భద్రత కోసమే షీటీం: ఎస్పీ గిరిధర్

నవతెలంగాణ- వనపర్తి రూరల్

మహిళల భద్రత కోసమే రాష్ట్ర పోలీస్ శాఖ ప్రత్యేకంగా షీటీంను ఏర్పాటు చేసిందని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీలో షీటీం, సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ రత్నం, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, లైంగిక దాడులు, యాంటీ ర్యాగింగ్, ఆత్మహత్యలు, సైబర్ క్రైమ్స్, టి సేఫ్ అప్లికేషన్స్, బాలికల అక్రమ రవాణాపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఒంటరిగా ఆటోల్లో గాని బస్సుల్లో గాని ప్రయాణిస్తున్నప్పుడు ఏదైనా అనుమానంగా అనిపించినా, ప్రమాదంలో ఉన్నప్పుడు డయల్ 100 గాని షీ టీం నెంబర్‌ను సంప్రదించాలని లేదా వాట్సాప్ ద్వారా నెంబర్ 6303923211కు మెసేజ్ చేయాలని సూచించారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైన సమయంలో తక్షణమే 1930 లేదా 100 కి లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సదస్సులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీత మహిళా చట్టాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో , మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ సునందని , ఫ్యాకల్టీ డాక్టర్ రవికుమార్, సిఐ నాగభూషణం ,రూరల్ ఎస్సై జలంధర్ రెడ్డి, వనపర్తి టౌన్ టు ఎస్సై రామరాజు, షీటీం హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుల్ రమేష్, కృష్ణ, సైబర్ సెక్యూరిటీ కానిస్టేబుల్ విజయ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఆయుష్మాన్ వైద్య సిబ్బం కి హెచ్ఐవి స్క్రీనింగ్ శిక్షణ

నవతెలంగాణ -వనపర్తి రూరల్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లాలో పనిచేస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఎల్ హెచ్ పిలు, వైద్యాధికారులకు హెచ్ఐవి స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి శ్రీనివాసులు జిల్లా ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి సాయినాథ్ రెడ్డి, ప్రోగ్రాం అధికారి రామచంద్రరావు ఇమ్యునైజేషన్ అధికారి పరిమళ, ఎంసి హెచ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంజుల హాజరయ్యారు. దీనిపై శిక్షణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ రమేష్ జిల్లా ట్యూటర్ చంద్రశేఖర్ లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్సీడీ పగ్రాం కోఆర్డినేటర్ కొండ శ్రీనివాస్, మహేశ్వర చారి జిల్లా డాటా మేనేజర్లు వెంకట కృష్ణారెడ్డి అశోక్ కుమార్ పాల్గొన్నారు.

చిన్నారెడ్డికి చిత్రపటం కానుక

నవతెలంగాణ- వనపర్తి

తన కల ద్వారా ఎన్నో చిత్రపటాలను గీసిన చిన్నారి నానమోని కావేరి తాను ఎంతో ఇష్టంగా గీసిన చిన్నారెడ్డి చిత్రపటాన్ని గురువారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డికి కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ చిన్నారి గీసిన తన చిత్రపటం అద్భుతంగా ఉందని అభినందించారు. భవిష్యత్తులో మంచి చిత్రకారుణిగా ఎదగాలని ఆకాంక్షించారు. అలాగే కావేరి తండ్రి టైలర్ వృత్తిలో కొనసాగుతున్నప్పటికీ సమాజానికి ఎంతో కొంత చేయాలన్న సదుద్దేశంతో హెల్మెట్ల ప్రధానం, బట్ట సంచుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడుతుంటారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

ఆర్టిజన్ ఉద్యోగుల సన్మానం

వనపర్తి రూరల్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కతో మాట్లాడి పాత చోటుకే బదిలీ చేయించినందుకు విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగులు గురువారం ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని సన్మానించారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ- వీపనగండ్ల

ఉమ్మడి మండల పరిధిలోని కాలూరు గ్రామానికి చెందిన సాయినాథ్ రెడ్డి బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే ఇటీవల చనిపోయిన భూపతి నారమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపాడు. అనంతరం చిన్న లింగస్వామి దశదిన కార్యక్రమంలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ గోవింద శ్రీధర్ రెడ్డి, వనపర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ గట్టు యాదవ్, మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ కొప్పునూరు సింగిల్ విండో డైరెక్టర్ డేగ శేఖర్ యాదవ్, దగడపల్లి మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఊకచెట్టు వాగుకు తగ్గిన వరద

నవతెలంగాణ- మదనాపురం

మదనాపురం రైల్వే గేటు సమీపంలో ఊకచెట్టు వాగుపై వరద ఉధృతి తగ్గిది. నీటి ఉధృతికి అలుగుపై ఆర్అండ్‌బీ రోడ్డు దెబ్బ తినడంతో వాహనాల రాక పోకలకు అంతరాయం ఏర్పడింది. అధికారులు చొరవ చూపించి సమస్యలను పరిష్కరించాలని వాహనదారులు కోరు తున్నారు. వంతెన వద్ద అధికారులు, నాయకులు ఎప్పటికప్పుడు రోడ్డును పరిశీలిస్తూ జనాలకు అవగాహన కల్పిస్తున్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

నవతెలంగాణ -పెబ్బేరు

పెబ్బేరు పట్టణంలోని 11వ వార్డ్ కు చెందిన నాగమణి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది విషయం స్థానిక నాయకులు ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డికి తెలపగా ఆయన రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. గురువారం స్థానిక కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, జిల్లా మైనార్టీ నాయకులు షకీల్,యువ నాయకులు హేమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈకి సన్మానం

నవతెలంగాణ- పెబ్బేరు

మండల విద్యుత్ శాఖ ఏఈగా బాధ్యతు చేపట్టిన కిరణ్ కుమార్‌ను గురువారం జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, నాయకులు రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-కందనూలు

ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యం.తారాసింగ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో సర్వే నిర్వహించి ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఒక్క వార్డెన్‌తో మూడు నాలుగు హాస్టళ్ల ఇన్చార్జులుగా నియమించడం వలన వార్డెన్లు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అద్దె భవనాలలో కొనసాగుతున్న హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం ఇబ్బందిగా మారిందని, అదేవిధంగా హాస్టళ్లను పూర్తిస్థాయిలో పట్టించుకోవడం లోపం జరుగుతుందన్నారు హాస్టల్లో పనిచేస్తున్న వర్కర్లందర్నీ రెగ్యులర్ చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని, రోజుకు ఒక గుడ్డు ఒక అరటిపండు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులకు బట్టలు, పెట్టెలు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు, దోమతెరలు విద్యార్థులకు తక్షణమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో భాను విజయ్ అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

10న రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై 'సెమినార్'

నవతెలంగాణ-కొల్లాపూర్ రూరల్

కొల్లాపూర్ మండల కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భారత రాజ్యాంగం ఎదురవుతున్న సవాల్ అనే సమస్యపై ఈనెల 10న సెమినార్ కేఎల్ఐ గెస్ట్ హౌస్‌లో నిర్వహించనున్నట్లు కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు అనుమగల హనుమంతు కొల్లాపూర్ మండల ప్రధాన కార్యదర్శి బత్తిని రాజు, మండల నాయకులు సాయి, కార్తీక్, సంజీవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-వెల్దండ

తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డితో పాటు కమిషన్ సభ్యులు గురువారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్ప గుచ్ఛం అందజేశారు. రాష్ట్రంలో ఫుడ్ కమిషన్ చేపట్టిన కార్యక్రమాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన తెలిపారు.

నేడు గురుకుల కళాశాలలో స్పాట్ కౌన్సిలింగ్

నవతెలంగాణ-బిజినేపల్లి

మండల కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల నందు 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం శుక్రవారం స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుమతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలింగ్ పాల్గొనే విద్యార్థులు మార్చి-2024 తెలంగాణ ఎస్ఎస్‌సీ బోర్డు నిర్వహించబడిన పబ్లిక్ పరీక్షలలో ఉత్తీర్ణులై ఉండాలి. స్పాట్ అడ్మిషన్లు పాల్గొనే విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు హాజరు కావాలన్నారు. టీసీ, బోనఫైడ్, కులం, ఆదాయం, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తదితర వాటిని తీసుకొని సహకాలంలో కళాశాలకు హాజరుకావాలని తెలిపారు.

పారిశుద్ధ పనులను పర్యవేక్షణ

నవతెలంగాణ-కొల్లాపూర్ రూరల్

కొల్లాపూర్ మున్సిపాలిటి పరిధిలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో గురువారం పారిశుద్ధ పనులను కౌన్సిలర్లు బరిగెల రాముడు యాదవ్, బరిగెల శ్రీలక్ష్మి వేణుగోపాల్ యాదవ్ స్వయంగా పర్యవేక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డులో ప్రజలకు పారిశుధ్యపరంగా ఏలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటు న్నామన్నారు. వారితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అధిక వర్షాలకు కూలిన ఇల్లు



నవతెలంగాణ-కొల్లాపూర్ రూరల్

కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చుక్కయ్యపల్లి గ్రామ 3వ వార్డ్‌లో వర్షా లకు దేవుని మేస్త్రి ఎల్లయ్య పెద్ద కుమారుడు దేవుని కురుమయ్య ఇల్లు కూలిపోయింది. ఇల్లు కూలిపోయిందని సింగల్ విండో డైరెక్టర్ పసుపుల నరసింహ దృష్టికి తీసుకపోగా వెంటనే స్పందించి మేస్త్రి ఎల్లయ్య ఇల్లును సందర్శించి ప్రస్తు తం ఉండడానికి కొంత ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా మంత్రి కృష్ణా రావు దృష్టికి తీసుకుపోయి ఇందిరమ్మ ఇండ్లలో ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మీసాల పెద్ద కురుమయ్య పసుపుల భాను, బంకల శేఖర్, పసుపుల పవన్, దేవుని చక్రి పాల్గొన్నారు.

రజక సంఘం నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కొల్లాపూర్ రూరల్

కొల్లాపూర్ పట్టణానికి చెందిన పట్టణ రజక సంఘం అధ్యక్షులు తిప్పరాజుల శ్రీనివాసులు అకాల మరణం చెందడంతో గురువారం రజక సంఘం జిల్లా అధ్యక్షులు తిప్పరాజుల నరసింహ, పట్టణ కమిటీ సభ్యుల సమక్షంలో నూతన కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ వివరాలు.. అధ్యక్షులు తిప్పరాజుల సన్ని, గౌరవ అధ్యక్షకులు చిన్న మహంకాళి, కార్యదర్శి పరుశురాం, కోశాధికారి శేఖర్, ఉపాధ్యక్షుడు జగదీష్ నూతన కమిటీ సభ్యులుగా ఎన్నుకున్న సభ్యులకు గౌరవ పెద్దలు నరసింహ, శివశంకర్, సత్యనారాయణ, వెంకటస్వామి, వస్త్రాల సత్యనారాయణకు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక పర్యవేక్షణలో జ్వర పీడితుల వివరాల సేకరణ

నవతెలంగాణ-బిజినేపల్లి

మండలంలోని గ్రామాలలో కాలనుగుణంగా విస్తరిస్తున్న చిరు వ్యాధులు, జ్వరపీడుతుల వివరాలను అన్ని గ్రామాలలో వైద్య ఆరోగ్య సిబ్బంది ద్వారా సేకరిస్తున్నామని, అవసరమైన రోగులకు ప్రత్యేక వైద్య ఆరోగ్య చికిత్సలు అందిస్తున్నామని మండల వైద్యాధికారి డాక్టర్ ఎం.శివకుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పోలేపల్లి, మహాదేవునిపేట్, పోలేపల్లితండాల్లో నిర్వహిస్తున్న జ్వర పీడితుల వివరాల సేకరణను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలతో ఇంటింటా ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నారని, జ్వరపీడుతుల వివరాలు సేక రించి అవసరమైన వారికి చికిత్సలు వెంటనే అందిస్తున్నామన్నారు. రోగులు ఆస్పత్రి సేవలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం తెలంగాణ డయాగ్నస్టిక్ ల్యాబ్ ద్వారా ఉచితంగా మలేరియా, చికున్ గునియా, డెంగ్యూ, థైరాయిడ్, లివర్ ఫంక్షన్ టెస్ట్, రీనల్ ఫంక్షన్ టెస్ట్, అధునాతమైన ల్యాబ్ సేవలు అందుబాటులో ఉన్నాయని ప్రజలు వచ్చే సమయంలో ఆధార్ కార్డ్ సెల్, నెంబర్‌తో రావాలన్నారు. కార్యక్రమంలో విస్తీర్ణ అధికారి రమేశ్ కుమార్,పర్యవేక్షకులు గంగ, తామర, అశోక్ కుమార్, ఆరోగ్య కార్యకర్తలు బేబీ ఉమా, రషీదోద్దీన్, రామాలింగమ్మ,శ్వేత,మీనా, మంగ, ఏస్.ఆంజనేయులు, ఆశా కార్యకర్తలున్నారు.

తండ్రి మందలించాడని ఉరేసుకొని బాలుడు మృతి



నవతెలంగాణ-కల్వకుర్తి

తండ్రి మందలించారని 12ఏళ్ల అబ్బాయి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలో కలకలం రేపింది. ఇంట్లో నీటి సంపు శుభ్రం చేస్తుండగా యశ్వంత్(12) అనే బాలుడు నీటిలో దిగాడు. ఈ విషయాన్ని గమనించిన తండ్రి నీటిలో దిగొద్దంటూ గట్టిగా మందలించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన బాలుడు ఇంట్లోకి వెళ్లి ఫ్యానుకు ఉరేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోని బాలుడు మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు బోరుణ విలపిస్తున్నారు. చిన్న విషయానికి 12 ఏళ్ల బాలుడు ఊరేసుకొని ఆత్మహత్య చేసుకోవడం పట్టణంలో కలకలం రేపింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై మాధవరెడ్డి తెలిపారు.

ముష్టిపల్లి మాజీ సర్పంచ్ లాలమ్మ మృతి



నవతెలంగాణ-పెద్దకొత్తపల్లి

మండల పరిధిలోని ముష్టిపల్లి మాజీ సర్పంచ్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. విషయం తెలిసిన మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ గ్రామానికి వెళ్లి మాజీ సర్పంచ్ తొల్ల లాలమ్మ పార్థీవ దేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం లాలమ్మ అంతిమయాత్రలో మాజీ ఎంపీపీ మండల ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ గౌరమ్మ, చంద్రయ్య, సింగిల్ విండో చైర్మన్ డి.బాలస్వామి, గంట్రావుపల్లి సర్పంచ్ పి.చిన్నయ్య, మాజీ ఎంపీటీసీ డి.రవి కుమార్, మాజీ సర్పంచు నాగమ్మ కురుమయ్య, రామ్‌లాల్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ మల్లేష్, మాజీ వార్డ్ మెంబెర్ ఈశ్వర్, మల్లేష్, హాబీబ్, నరేంద్ర చారీ ఉన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కే.గీత



నవతెలంగాణ-కందనూలు

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కే.గీత డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో వివిధ వార్డులలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పొంగిపొర్లుతున్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టౌన్‌లో వేసిన అండర్ గ్రౌండ్ పైపులలో చెత్తాచెదారంతో పేరుకుపోయి ఆ నీరంతా బయటకు రావడం ఇళ్ల పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతూ పరిసర ప్రాంత ప్రజలకు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ పరిస్థితిపై సంబంధిత కాంట్రాక్టర్‌కు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టి పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అండర్ డ్రైనేజీ వ్యవస్థను రిపేర్ చేయించి పరిసర ప్రాంతాలు ప్రజలను రోగాల బారి నుండి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, మల్లయ్య, వెంకస్వామి, కాలనీవాసులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే : మంత్రి

- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



నవతెలంగాణ-కందనూలు/నాగర్‌కర్నూల్ రూరల్

సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే అని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం రోజు జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా తేజ కన్వెన్షన్, ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవానికి మంత్రితో పాటు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, కలెక్టర్ బాదావత్ సంతోష్, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తి నుండి రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి హోదాలో పని చేశారని వారి పుట్టిన రోజున ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నామని తెలుపుతూ ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లాలోని 58మంది ఉపాధ్యాయులను మంత్రి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, కలెక్టర్‌లు ఉత్తమ ఉపాధ్యాయులకు మెమెంటో, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని విశ్రాంత ఉద్యోగుల కార్యాలయం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ సేవా సదనలో మహోపధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి పురస్కరించుకొని వారి విగ్రహానికి పూలమాల వేసి ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విశ్రాంతకం ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, మండల అధ్యక్షులు బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, కార్యదర్శి యుగంధర్ రెడ్డి, వెంకట శెట్టి, నర్సయ్య, వార్డెన్ చెన్నయ్య, కృష్ణయ్య,పాండు, పాండురంగయ్య, వేణుగోపాల్, వెంకటొరెడ్డి, జగన్మోహన్‌రావు విశ్రాంత ఉద్యోగులున్నారు.

తెలకపల్లి : మండల కేంద్రంలో, పరిసర గ్రామాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాపిశెట్టి శ్రీనివాసులు, మండలంలోని ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, మండల విద్యా వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్ : మండల పరిధిలోని వివిధ గ్రామాలలో, కొల్లాపూర్ పట్టణంలో పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కొల్లాపూర్ పట్టణ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వనజ, ఉపాధ్యాయులు సుప్రియ, కురుమయ్య, రమాదేవి, నరేందర్ రెడ్డి, జిల్లా పరిషత్ మోడల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రామచందర్ రావు, ఉపాధ్యాయులు ఎండి.మహమూద్, మధుసూదన్ శర్మ, యన్మన్ బెట్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పబ్బు సరేందర్ గౌడ్, సుధాకర్ ఉపాధ్యాయులున్నారు.

వెల్దండ : మండల కేంద్రంలో, మండల పరిధిలోని కొట్ర, రాచూర్ జడ్పీహెచ్‌ఎస్ తదితర పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టి.వెంకటరెడ్డి, వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు కిష్టా రెడ్డి, జంగయ్య, రాం కిషన్, మురళీ, జైపాల్, సురేష్, సుదర్శన్ విద్యార్థులున్నారు.

అచ్చంపేట : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్లో లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో 40మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లైన్స్‌క్లబ్ అచ్చంపేట అధ్యక్షులు వెంకటేష్, లయన్స్ క్లబ్ మెంబర్ శ్రీనివాసులు, సెక్రెటరీ పోల శ్రీనివాస్, సీనియర్ సభ్యులు చంద్రకుమార్, చారీ మండికారి బాలాజీ, లింగా రెడ్డి, వెంకటేష్, పులిజాల రమేష్, దాసు సాయిబాబా తదితరులు ఉన్నారు.

బిజినేపల్లి : ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా శాయిన్‌పల్లి జెడ్పిహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులకు గ్రామ మాజీ సర్పంచ్ అవంతి శంకర్ శాలువాతో సన్మానించారు. అంతకుముందు ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ పాఠశాలలో గురు దినోత్సవ సందర్భంగా పాఠశాలకు వచ్చి మాజీ సర్పంచ్ అవంతి ఉపాధ్యాయులందరికీ సన్మానించినందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

తిమ్మాజిపేట : మండలంలోని గొరిట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా 2023-24 బ్యాచ్ విద్యార్థులకు మొదటి ర్యాంకు రెండో ర్యాంకు మూడో ర్యాంకు 4 ర్యాంకు సాధించిన విద్యార్థులకు ఒకటో ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.6,219 రెండవ ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.4118 మూడవ ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.2118 నాలుగో ర్యాంకు సాధించిన విద్యార్థికి 1616 రూపాయలను అందించి బహుమతులు పూర్వ విద్యార్థుల సంఘం తరఫున అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి జుట్టు ఉత్తరయ్య, ఉపాధ్యక్షులు జన వెంకటస్వామి, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థిలు, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులున్నారు.

తాడూర్ : ఉపాధ్యాయ దినోత్సవాన్ని మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి : సీపీఐ(ఎం)



నవతెలంగాణ-పెంట్లవెల్లి

పెంట్లవెల్లి చెరువు నీటిలో మునిగిన బాధితులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఈశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ(ఎం) బృందం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోనీ చెరువు నీటిలో మునిగిన ప్రాంతాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల నాయకులు హనుమంతు, శాఖ కార్యదర్శి ఎం.తిమ్మస్వామి, కురుమయ్య శ్రీనివాసులు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వంగూరు : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో రైతులు వేసిన పంటలు నీటిలో మునిగిపోయి, గ్రామాలలో ఇండ్లు కూలి నేలమట్టమయ్యాయి ఇతరుల ఇండ్లలో తలదాచుకుంటున్నారని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింత ఆంజనేయులు కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున అందించి, కూలిన ఇండ్లకు పరిహారం అందించాలని కోరుతూ మండల డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బి.బాలస్వామి, మండల నాయకులు మీసాల వెంకటయ్య ఆంజనేయులు, రైతు పాపి రెడ్డి పాల్గొన్నారు.



'బాధిత కుటుంబానికి అండగా సీఐటీయూ'



ఊరుకొండ : అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందిన గ్రామపంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ అకాల మరణం తీరనిలోటని.. బాధిత కుటుంబానికి సీఐటీయూ, రైతు సంఘం నాయకులు, కార్మిక సంఘాల నాయకులు ఎల్లవేళ అండగా ఉంటారని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు అన్నారు. గురువారం మండల పరిధిలోని రాచాలపల్లి గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ ముసలయ్య(50) మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీఐటీయూ నాయకులు, రైతు సంఘం నాయకులు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు మృతుడి గ్రామానికి వెళ్లి సంతాపం తెలిపి.. బాధిత కుటుంబ సభ్యులకు భరోసా కల్పించడంతోపాటు సీఐటీయూ, కార్మిక సంఘ నాయకులు అండగా ఉంటాయని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్మికుడు ముసలయ్య అంత్యక్రియ లలో పాల్గొని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్ర మంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చిలుక బాల్‌రెడ్డి, మండల యూనియన్ అధ్యక్షులు పరశురామ్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, సలహా కార్యదర్శి చంద్రయ్య, సహాయ కార్యదర్శి బిక్షపతి, కోశాధికారి అలివేల, ఎల్లయ్య, పద్మ శంకరమ్మ జంగయ్య, బాల్ చెన్నమ్మ నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం పట్ల అవగాహన అవసరం

- ఐసీడీఎస్ సూపర్వైజర్ నిర్మల



నవతెలంగాణ-బల్మూరు

అంగన్వాడీ కేంద్రాల లబ్దిదారులకు పోషకాహారం పట్ల ఆకుకూరల ప్రాముఖ్యత పట్ల అవగాహన అవసరమని బల్మూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సపర్వైజర్ నిర్మల అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఒకటవ, నాలుగవ అంగన్వాడీ కేంద్రాలలో పోషణ మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా లబ్దిదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గర్భిణీలకు, బాలింతలకు, పిల్ల తల్లులకు పోషకాహారం, పరిసరాల పరిశుభ్రత, మంచినీరు, సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోషణ అభియాన్ కో-ఆర్డినేటర్ పార్వతి, అంగన్వాడీ టీచర్లు జయప్రద, భాగ్యమ్మ, గర్భిణీలు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.



బిజినేపల్లి : మండలంలోని ఖానాపూర్ గ్రామంలో గర్భిణీలు, పిల్లలు, బాలింతలు పోషక విలువలు గల సమతుల్య ఆహారం తీసుకోవాలని అంగన్వాడీ టీచర్ పద్మ కోరారు. పోషకాహార మహోత్సవాల సందర్భంగా గురువారం మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలోని అంగన్వాడీ సెంటర్లో పోషకాహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలను, బాలింతలను, చిన్నారులను సమావేశపరిచి పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలని అవగాహన కల్పించారు.

అర్హులంతా ఓటుహక్కు నమోదు చేసుకోవాలి

- తహసీల్దారు శ్రీరాములు

బిజినేపల్లి : అర్హులంతా ఓటుహక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దారు జనుంపల్లి శ్రీరాములు కోరారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో గురువారం ఓటుహక్కు నమోదుపై బీఎల్‌ఓలకు అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండల పరిధిలో ఉన్న 64 బూత్లకు బీఎల్‌ఓలను నియమించి ఆయా గ్రామాల్లో 2025, జనవరి 1లోపు 18ఏళ్లు నిండే యువతీ యువకుల ఓటుహక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఓటుహక్కు నమోదుకు ఫారం-6 దరఖాస్తు నింపి సంబంధిత బీఎల్‌ఓకు గానీ ఎన్నికల సంఘం యాప్‌లో ఆన్‌లైన్ ద్వారా అప్లై చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీటీ రవికుమార్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-ఊరుకొండ

కష్టాల్లో ఉన్న బడుగు బలహీన వర్గాల పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ముచ్చర్లపల్లి గ్రామానికి చెందిన కుడుముల వెంకటమ్మ(70) మృతి చెందిన విషయాన్ని కాంగ్రెస్ నాయకులద్వారా తెలుసుకుని వెంకటమ్మ పార్థివ దేహానికి పూలమాల అర్పించి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మండలంలోని రాచాలపల్లి గ్రామానికి చెందిన జిల్లా ముసిలయ్య(50) అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న జడ్చర్ల ఎమ్మెల్యే ముసిలయ్య పార్థివ దేహానికి పూలమాలవేసి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అదేవిధంగా ఇప్పపాడు గ్రామానికి చెందిన దుబ్బ పెంటయ్య మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని నింపారు. మండలంలోని బొమ్మరాశిపల్లికి చెందిన మేకల శంకర్ తల్లి లక్ష్మమ్మ దశదినకర్మలో పాల్గొని సంతాపం తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం..

మండల పరిధిలోని రాచాలపల్లి గ్రామానికి చెందిన జెల్ల ముసిలయ్య(50) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రజానాయకులు నాయిని హైమావతి యాదగిరి రెడ్డి రూ.15వేలు, జకినాలపల్లి మాజీ సర్పంచ్ తలసాని అనిల్ రెడ్డి రూ.5వేలు, రాచాలపల్లి ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్ రూ.6వేలు మొత్తం రూ.26 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు నరేష్ యాదవ్, దాసు, వెల్డింగ్ గోవిందు, గ్రామస్తులు పాల్గొన్నారు.


బైరాపూర్‌లో.. కాటమయ్య బోనాలు

వెల్దండ : మండల పరిధిలోని బైరాపూర్ గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన కాటమయ్య బోనాలు గురువారం ఘనంగా నిర్వహించారు. గౌడ కులస్తుల ఆధ్వర్యంలో కాటమయ్యకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దార్ల కుమార్, ఉప సర్పంచ్ రమేష్ గౌడ్, మాజీ వార్డు సభ్యులు శ్రీశైలం గౌడ్, మెండె మల్లేష్ యాదవ్, గ్రామస్థులు కోటయ్య, కొండల్, సత్యం, రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బాలుర హాస్టల్‌ను బాగు చేయండి

- ధర్మ సమాజ్ పార్టీ నాయకులు





నవతెలంగాణ-బల్మూరు

బీసీ బాలుర హాస్టల్‌ను బాగు చేయండని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట నియోజకవర్గం నాయకులు సాయి మహారాజు డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని కొండనాగుల గ్రామంలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలకు హాస్టల్ పూర్తిగా శిధిలావస్థకు చేరుకున్నదని, గదులలో కప్పు ఉడి పడుతుండడంతో విద్యార్థులు ప్రాణ భయంతో గడుపుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం గత మూడేళ్ల క్రితం బిల్డింగ్ పూర్తిగా డిస్మెంటల్ చేయాలని సర్క్యులర్ జారీ చేసిందన్నారు. కానీ కొత్త బిల్డింగ్ మంజూరు చేయకపోవడంతో అక్కడే ఉంటున్న విద్యార్థులు మొన్నటి వర్షాలకు కొద్ది మంది విద్యార్థులను హాస్టల్ వార్డెన్ శ్రీరాములు అద్దె ఇంట్లో ఉంచుతున్నారన్నారు. ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూలీ పనులు చేసి పిల్లలని చదించలేమని హాస్టల్‌లో చేర్పితే ఇప్పుడు ఆ పిల్లల భవిషత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ప్రభుత్వాలూ మారిన మా పేద పిల్లల వసతి గృహాలు మారుతలే వని, వారికి నాణ్యమైన పౌష్టిక ఆహారం అందిస్తలేరని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారన్నారు. వసతి గృహాల పట్ల ప్రభుత్వానికి ఇంత నిర్లక్ష్యమేంటన్నారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి న, ఇప్పుడున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లిన ఎటువంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. సమస్యన్ని సంబధిత అధికారులు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు శేఖర్ మహారాజ్, వెంకటేష్, వికాస్, శ్రీనివాస్ మెదరి, అజయ్, నరేష్, భారత్, సాయి, వడ్డెర శేఖర్, బాలరాజు గంగాపుత్ర సంఘం నాయకులు, జగదీష్, వెంకటేష్, శంకర్ గౌడ్, నగేష్ నాయి బ్రాహ్మ ణ సంఘం నాయకులుపాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యసాధన కోసం చదవాలి

- వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరెడ్డి

నవతెలంగాణ-వెల్దండ

విద్యార్థులు ప్రతి ఒక్కరు ఉన్నత లక్ష్యం ఎంపిక చేసుకొని లక్ష్యసాధన కోసం చదువులలో ముందుకు సాగాలని వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వందేమాతరం ఫౌండేషన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరెడ్డి మాట్లాడారు. అంతకుముందు ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోపాలరావు, ఇక్రిసాట్ రిటైర్డ్ సైంటిస్ట్ ప్రసాద్, అధ్యాపకులు విజయలక్ష్మి, ప్రవీణ, శివ ప్రసాద్, రమేష్, కిరణ్, షణ్ముఖ రెడ్డి, నవీన్, అంజమ్మ, ఉస్సేన్, భారత్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాటమయ్య రక్ష కిట్ వాడకంపై అవగాహన



కల్వకుర్తి : గీతా కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా వారికి రక్షణ కల్పించడానికి ప్రభుత్వం అందివ్వనున్న కాటమయ్య రక్ష కిట్ వాడకంపై గీత కార్మికులకు గురువారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మండలంలోని తర్నికల్ గ్రామంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధాకర్ ఆధ్వర్యంలో కాటమయ్య రక్ష కిట్‌తో తాటిచెట్లు ఎలా ఎక్కి కల్లు ఎలా తీయాలనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ అనేకమంది గీతా కార్మికులు ప్రమా దాల బారిన పడి మృతి చెందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారికి రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నజీమ్ అలీ అక్తర్, పరిషరాములు గౌడ్, ఎక్సైజ్ సీఐ వెంకట్ రెడ్డి, వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ పాండు గౌడు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
4
నారాయణపేట
శుక్రవారం | సెప్టెంబర్ 06, 2024 | www.navatelangana.com

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

– సీఐ శివ శంకర్



నవ తెలంగాణ – నారాయణపేట

పండగలను శాంతియుతంగా నిర్వహిం చుకోవాలని సీఐ శివ శంకర్ సూచించారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు.. గణేష్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండగల సందర్భంగా సీఐ ఆధ్వర్యంలో గురువారం మెట్రో గార్డెన్ ఫంక్షన్ హాలులో హిందూ, ముస్లిం మత పెద్దలు, మండపాలా నిర్వాహకులతో శాంతి సంఘ సమావేశం నిర్వహించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలులో భాగంగా గణేష్ శోభాయాత్ర సమయంలో విగ్రహాల ఏర్పాటు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మత పెద్దలు ఉత్సవ కమిటీ సభ్యులు పలు సూచనలను చేశారు. ఈ సందర్భంగా పేట సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నారాయణపేట మండలంలో ఇప్పటివరకు గణేష్ ఉత్సవాల సమయంలో ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకపోవడం చాలా సంతోషకర విషయమని, ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలని భవిష్యత్‌లో ఎలాంటి సంఘటనలు జరగకుండా తమ వంతుగా ఉత్సవ కమిటీలు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలకు పటిష్ఠమైన పోలీసు భద్రత ఉంటుందని, నిమజ్జనం అయ్యే వరకు ప్రతి గణేష్ మండపానికి 24 గంటలు భద్రత కల్పిస్తాం, సిఫ్టల వారీగా సిబ్బంది విధులు నిర్వహిస్తారని అన్నారు. ఉత్సవాలను ఒకరిపై ఒకరు పోటీ కోసం జరప వద్దని అందరూ కలిసిమెలిసి భక్తి భావంతో ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని సీఐ విజ్ఞప్తి చేశారు. గణేష్ విగ్రహాల ఏర్పాటుకు మండపాల ఏర్పాటుకు ముందస్తుగా ఆన్లైన్ పోలీసు పోర్టల్ లో అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఎక్కడ ఏ విగ్రహం ఏర్పాటు చేశారనేది పోలీసు వారి దృష్టిలో ఉంటే భద్రత కల్పించడం సులువవుతుందని, సెక్టార్ల వారీగా పోలీస్ సిబ్బంది అనుక్షణం విధులు నిర్వహిస్తారన్నారు. మండపాల ఏర్పాటు సమయంలో నాణ్యమైన సామాగ్రి ఉపయోగించాలన్నారు. నాణ్యమైన కరెంట్ వైర్ ఉపయోగించాలని, మండపాల వద్ద ఫైర్ సేఫ్టీ కోసం నీటి బకెట్స్, ఇసుక బకెట్స్, వంటివి అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఉత్సవ కమిటీ సభ్యులు అందుబాటులో ఉండాలని కోరారు. వివాదాస్పదమైన స్థలం లో మండపాలు ఏర్పాటు చేయొద్దు, రోడ్లపై ఏర్పాటు చేయొద్దు అని నిమజ్జనం శోబాయాత్రలో ఉపయోగించే వాహనం కండిషన్‌లో ఉండాలని, పిల్లలను శోభాయాత్ర వాహనాలు ఎక్కించవద్దు అని అన్నారు. బాణా సంచా నిషేదం. భక్తి పాటలు ప్రసారం చేయాలని సూచించారు. రాత్రి 10 గంటల తర్వాత మైక్‌లు పెట్టరాదని విజ్ఞప్తి చేశారు. మట్టి వినాయకులను ఏర్పాటు చేయడం పర్యావరణానికి మంచిదని అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారాన్ని నమ్మొద్దు, తప్పుడు సమాచారంతో ఎవ్వరూ ఉద్రేకానికి లోనై చట్ట ఉల్లంఘనకు పాల్పడవద్దన్నారు. ఏదైనా ఉంటే అధికారుల దృష్టికి తెచ్చి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గణేష్ మండపాల నిర్వాహకులు, హిందూ, ముస్లిం మత పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

• సీఐ రాజేందర్ రెడ్డి



నవతెలంగాణ – మరికల్

జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు.. మరికల్ మండల కేంద్రంలో గురువారం మరికల్ పోలీస్ స్టేషన్లో రాజకీయ నాయ కులు, గణేష్ మండప నిర్వాహకులు, హిందూ, ముస్లిం మత పెద్దలందరితో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రాజేందర్ రెడ్డి , ఎస్సై మురళీ మాట్లాడుతూ రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు, మిలద్ ఉన్ నబీ పండుగల సందర్భంగా హిందూ, ముస్లిం ప్రజలంతా కులమతాలకు అతీతంగా పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. మరికల్ మండలంలోని గణేష్ మండపాల నిర్వాహకులతో వినాయక విగ్రహాలకు సంబంధించిన సమాచారాన్ని https:// policeportal. tspolice. gov.in/index.htm పోలీస్ పోర్టల్ లో తప్పకుండా నమోదు చేసుకోవాలన్నారు. అలా నమోదు చేసుకోవడం వల్ల ఎక్కడ ఎలాంటి సమస్య లు తలెత్తిన వెంటనే చేరుకొని పరిష్కరించడం జరుగుతుందన్నారు. విధిగా గణేష్ విగ్రహాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీస్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మరికల్ మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పూర్తి బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. మత పెద్దల సలహాలు, సూచనలు స్వీకరించడం జరిగిందని పై అధికారులకు తెలుపడం జరుగుతుందని, పండగల సమయంలో ప్రజ లంతా సంయమానం పాటించాలని సూచించారు.సోషల్ మీడియాలో ఒక మతాన్ని కవర్గాన్ని కించపరుస్తూ పోస్టులు చేయరాదని ,అలాంటి పోస్టులు చేసే వారిపై గ్రూప్ అడ్మిన్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ప్రజలు అత్యవసర సమయంలో డయాల్ 100 పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ,ముస్లిం మత పెద్దలు, స్థానిక నాయకులు, మండలంలోని వివిధ పార్టీల నాయకులు , గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా .. తప్పిన పెను ప్రమాదం

నవతెలంగాణ – మాగనూర్



ట్రాక్టర్ బోల్తా .. తప్పిన పెను ప్రమాదం తప్పిన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మాగనూరు మండలంలోని నేరడగం గ్రామం సమీపంలో చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో లెవెల్ రైట్ కెనల్ జీరో పాయింట్ వద్ద రోడ్డుకి మద్దెల గండీ పడింది. మక్తల్‌కు సంబంధించిన ట్రాక్టర్ ఓనర్ రవిరెడ్డి తన డ్రైవర్ నవీన్ సెంట్రింగ్ డబ్బాలను మాగనూరు మండలంకు సంబంధించిన ఉజ్జెలి గ్రామం నుంచి మక్తల్‌కు సెంట్రింగ్ డబ్బులు వేసుకుని వెళ్తుండగా అక్కడ గండీ పడడం కొత్త డ్రైవరు గమనించలేకపోవడంతో ట్రాక్టర్ ట్రాలీ టైరు గండిలో ఇరుక్కుపోయి బోల్తాపడింది. డ్రైవర్‌కు పెను ప్రమాదం తప్పింది. గత నాలుగు రోజుల కిందట మక్తల్ ప్రైవేటు స్కూల్ బస్సుకు కూడా ప్రమాదం తప్పిందని, అందులో దాదాపుగా 30 మంది విద్యార్థులు ఉన్నారని, ఆ రోజు కూడా ప్రమా దం నుంచి విద్యార్థులు బయటపడ్డారని స్థానికులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కర్ణాటక బార్డర్ అయిన ఈ కెనాల్ కర్ణాటక రాష్ట్రం నుంచి మక్తల్‌కు కర్ణాటక నివాసులు అధిక సంఖ్యలో వస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వారు చొరవ తీసుకొని త్వరగా మరమ్మతులు చేయాలని నేరడగం గ్రామస్తులు కోరుతున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

• పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి

నవతెలంగాణ – మరికల్

మరికల్ మండల కేంద్రంలో వరుసగా కురిసిన వర్షాలకు గురువారం మరికల్‌లోని దత్త నగర్ వీధిలో దోమల నివారణ మందును పంచాయతీ సిబ్బంది పిచికారి చేశారు. ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని ప్రతి వాడలో దోమల మందు పిచికారి చేస్తున్నామని పంచాయతీ కార్యదర్శి శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు.ఇంటి పరిసరాల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏ వార్డులోనైనా దోమల మందు పిచికారి చేయకుంటే తమకు సమాచారం ఇవ్వాలని వార్డు సభ్యులు, ప్రజలను కోరారు.

గొర్రెలను అపహరించిన వ్యక్తి అరెస్ట్

నవ తెలంగాణ – క్రిష్ణా



జాతీయ రహదారి పక్కన ఉన్న గొర్రెలను మేకలను దొంగతనానికి పాల్పడుతున్న దొంగని పోలీసులు గురువారం పట్టుకున్నట్లు కృష్ణ ఎస్సై నవీద్ తెలిపారు. గురువారం సమయంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన తుఖారం రాథోడ్‌ని పట్టుకున్నారు. టవేరా వాహనం, స్కూటీ, లక్షా65 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు మక్తల్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈయన ఇంతకుముందు హిందూపూర్, కున్సి, గ్రామాల రహదారి పక్కన ఉన్న గొర్రెల మందలను రాత్రి వేళలో దొంగతనం చేసుకొని వెళ్తుండేవాడని , ఇంతకుముందే ఈయన అనేక దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్ తరలించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాత



నవతెలంగాణ – నారాయణపేట

నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు.. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు గురువారం నారాయణపేట మండలంలోని అంత్వర్, సింగారం గ్రామాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై కళాజాత నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కళాకారులు పాటలు పాడుతూ అభయ హస్తం ఆరు పథకాలు మహాలక్ష్మి, గృహ జ్యోతి, రైతు భరోసా, రుణమాఫీ, విద్యా భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం తదితర అభివృద్ధి పథకాలపై గ్రామస్తులకు వివరించారు. నారాయణపేట జిల్లాలోని పలు గ్రామాలలో నిరుపేదలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు టీం లీడర్ బీ.రవిశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు బీ.రవిశంకర్, కిరణ్, బాలయ్య నరసింహ, చెల్లా లక్ష్మి, అరుణ, సుగుణ, రాధాజ్యోతి, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

• ట్రైనీ కలెక్టర్ గరిమనరుల
• ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

నవ తెలంగాణ – నారాయణపేట

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే వారి వృత్తికి గౌరవమని ట్రైనీ కలెక్టర్ గరిమనరుల అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని రెవెన్యూ డివిజనల్ అధికారి సమావేశం హాల్‌లో మాజీ ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవంలో ట్రైనీ కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిని వెలిగించి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ తాను ఈ స్థాయికి చేరుకున్నానంటే ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని అభినందించారు. డీఈఓ అబ్దుల్ ఘనీ మాట్లాడుతూ సమాజాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయులలో ఉందని అన్నారు. ఉపాధ్యాయులుగా పనిచేసే ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని అభినందించారు. డీఆర్డీఓ మొగులప్ప మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో బాధ్యత కలిగినదని తెలిపారు. సమాజానికి దిక్సూచి లాంటి ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలవాలన్నారు. ఏఎంఓ మాట్లాడుతూ 90 మంది హెల్ప్ టీచర్లను నియమిం చుకున్నామని, 284 మంది అకాడమిక్ ఇన్స్ట్రక్టర్లను నియమిం చుకోవడం జరిగిందన్నారు. కలెక్టర్ సూచనల మేరకు.. జిల్లాలో ఉత్తీర్ణత శాతం పెంచామని తెలిపారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులని, ప్రతి రోజు కొత్త విషయాలు బోధిస్తారని తెలిపారు. ఎస్ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 44 మంది ఉపాధ్యాయులకు మొమెంటో, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎండీ అబ్దుల్ ఘనీ, డీపీఆర్ఓ రషీద్, సెక్టోరల్ అధికారులు శ్రీనివాస్, విద్యాసాగర్, రాజేందర్ కుమార్ పద్మ నళిని, నాగార్జున, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ స్టార్ హైస్కూల్‌లో..

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని లిటిల్ స్టార్ హై స్కూల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పాఠశాల ప్రిన్సిపాల్ అండ్ కరస్పాండెంట్ పీ.ఉమా మనోహర్ గౌడ్ పూజలు నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 5వ తేదీ నీ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. గురువులను దైవంగా భావించే సంస్కృతి మనదని, తల్లిదండ్రుల తర్వాత గురువులదే స్థానమని, గురువులు విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తారని అన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థినీ, విద్యార్థులు ప్రిన్సిపాల్ అండ్ కరస్పాండెంట్ పీ.ఉమా మనోహర్ గౌడ్‌ను శాలువా, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ – ఊట్కూర్

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని తపస్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ఊట్కూర్ లోని బాలుర ఉన్నత పాఠశాలలోని భారతరత్న డా.సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాల వేసి ఉపాధ్యాయ దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా సమన్వయ కర్త నర్సింగప్ప , బాలుర ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జి హెచ్ ఎం కుసుమ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు తరగతి గదిలో నిర్మితమౌతుందని చాలా మంది మహానుభావులు చెప్పడం జరిగిందన్నారు. డా.


నారాయణపేటలో..


నారాయణపేటలో..

సర్వేపల్లి రాధాకృష్ణన్ తన జీవితాన్ని ఉపాధ్యాయ వృత్తితో ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగి భారతదేశానికి తొలి ఉపరాష్ట్రపతిగా ,రెండవ రాష్ట్రపతిగా సేవలు అందించడం జరిగిందన్నారు .

ఉత్తమ ఉపాధ్యాయునికి అభినందన

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన ఊట్కూర్ సీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయులు గోపాల్‌ను ఉపాధ్యాయుల బృందం అందరూ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల జీ హెచ్ ఎం మాధవి , తపస్ మండల కార్యదర్శి కృష్ణ, నాయకులు రాములు , వెంకటేష్ గణప, విజయలక్ష్మి పారిజాత, గోపాల్ ,అశోక్ , మురళీధర్, సాయినాథ్ , మహేష్ ,జయశ్రీ , రమాదేవి , ప్రేమకుమారి ,శిరీష అశోక్ బాబు ,కవిత , పృథ్వీ రాజ్ బన్సీశ్ , నర్సింములు, సబసుల్తాన, ఫజలూరి రెహమాన్, ఖాజా భను, ఖాజా మైనుదిన్,అంగన్వాడీ టీచర్లు ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తంతో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటం

ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని చిన్న పొర్ల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఆర్ట్ అండ్ డ్రాయింగ్ టీచర్ గా పని చేస్తున్న కె లక్ష్మణ్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రాన్ని రక్తంతో గీశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే రామచంద్ర చారి ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో లక్ష్మణ్‌ను ఘనంగా సన్మానించి అభినందించారు.

నవతెలంగాణ – మరికల్

సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో ని భారతి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ ఎం లక్ష్మీకాంత్ రెడ్డి, సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భారతి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ సమాజానికి ఉత్తమ పౌరులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులని అన్నారు. దేశ పునర్నిర్మాణంలో గొప్ప పాత్ర పోషించేది ఉపాధ్యాయ వృత్తి అని అన్నారు. మండల కేంద్రంలో నోబుల్ టాలెంట్ హై స్కూల్, ఆక్స్ఫర్డ్ హై స్కల్ , రిషి హై స్కూల్, ప్రతిభ హై స్కూల్, పీ ఎస్ ఏంజెల్స్ హై స్కూల్, వెంకటసాయి హై స్కూల్, శ్రీవాణి హై స్కూల్ , మరికల్ మండలంలోని పలు గ్రామాలలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుల, విద్యార్థులు, విద్యార్థినీలు ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు.

నవతెలంగాణ – మాగనూర్

మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకున్నారు. సమాజం లో ఏ రంగమైన ఉన్నత స్థితిలో వున్నది అంటే అది కేవలం గురువు ద్వారా మాత్రమే సాధ్యమని జీహెచ్ఎం మురళీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకటస్వామి, సంజన, బాబు, స్పందన, వెంకట్రాములు, జమ్మన్న, రామకృష్ణచరీ, రాకేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ – కోస్గి

చక్కని విద్యాబుద్ధులు నేర్పి విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయల పైనే ఉందని కోస్గి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ పూర్ణచంద్ర యాదవ్ అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని గురువారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రం లో లైన్స్ క్లబ్ ఆఫ్ కోస్గి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే మెరుగైన సమాజం ఏర్పాటు కావాలిసిన అవసరం ఉందని అన్నారు. ఉపాధ్యాయుల కృషి వల్లే భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రపంచంలోని అన్ని దేశాలతో పోటీపడుతున్నదని అన్నారు. తమ పిల్లలుగా భావిస్తూ విద్యాబోధన చేయడం వెలకట్టలేని సేవలని ప్రశంశించారు. తమ ఉద్యోగ విధుల్లో భాగంగా ఎంతో మందిని ఉన్నత స్థాయికి తెచ్చిన ఉపాధ్యాయులను ఈ రోజు సన్మానించే దక్కడం తనకేంతో గర్వకారణంగా ఉందని అన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసిన ఉపాధ్యాయులు వార్ల మల్లేశం, రామకృష్ణ , వీరమల్లేష్ , విష్ణుచారీల సేవలు కొనియాడుతూ క్లబ్ అధ్యక్షులు పూర్ణచంద్ర యాదవ్ శాలువా పూలమాలలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యావనరుల ప్రాంగణంలోని సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కాబినెట్ సెక్రటరీ బెజ్జు వెంకట్ రాములు, ప్రతినిధి చంద్రశేఖర్ , ఎం ఐ ఎస్ కో ఆర్డినేటర్ రత్నమాల, సీఆర్పీ దస్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ – ధన్వాడ

మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం వద్ద మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ అంజలి దేవి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప తత్వవేత్త, పండితుడని, 1954 లో భారతదేశంలో అత్యున్నత పౌర పురస్కారమైన భారత రత్న,1963 లో బ్రిటిష్ రాయల్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ గౌరవ సభ్యత్వం పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో గాయత్రి , ఉపాధ్యాయులు శ్రీనివాస్ సాగర్, రామకృష్ణ డాటా ఎంట్రీ ఆపరేటర్ రాఘవేందర్ నాయుడు, సీ ఆర్ పీ ఎం నారాయణ, ఐఈఆర్పీ శ్యాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎం.పీ.పీ.ఎస్‌లో ..

మండలకేంద్రంలోని ఎంపీపీఎస్ సంతబజార్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని రామకృష్ణ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం , ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులను నూతనంగా వచ్చిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీలకు విద్యార్థులు ఘనంగా సన్మానించారు. భద్రాద్రి రామకార్యం నిర్వాహకులు పులికండ్ల జయశ్రీ, పులికండ్ల వెంకట్రాములు విద్యార్థులకు ప్లేట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేంచే బాలరాజ్, ఎం శ్రీనివాసులు, పుష్పలత, సౌజన్య మౌలిక, సుజాత, గీత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ధన్వాడలో..


కోస్గిలో..


నారాయణపేటలో..


మాగనూర్‌లో..


ఊట్కూర్‌లో..


మరికల్‌లో..

పూజారి చక్రపాణిని అరెస్టు చేయాలి

• కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి బీ. కృష్ణ

నవ తెలంగాణ – క్రిష్ణా



దళితుల పెళ్లిని గుడిలో జరగనివ్వకుండా అడుకున్న చక్రపాణి పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదై 20 రోజులు కావస్తున్న పూజారి, ప్రభుత్వ ఉద్యోగి అయిన చక్రపాణిని అరెస్టు చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి బీ. కృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట మూడుమల్ దళిత న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో చక్రపాణిని వెంటనే అరెస్టు చేయాలనే డిమాండ్ తో రిలే నిరాహారదీక్షకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల పెళ్లి అడ్డుకున్న చక్రపాణి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కొన్ని సంవత్సరాల నుంచి ఏకకాలంలో రెండు ప్రభుత్వ జీతభత్యాలను పొందుతున్న పూజారి చక్రపాణి ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. చక్రపాణి అరెస్టు చేసేదాకా ఈ నిరాహార దీక్షలు కొనసాగుతూనే ఉంటాయని , ముందు ముందు ఇంకా పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నట్లు హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముడుమల్ దళిత న్యాయ పోరాట కమిటీ నాయకులు, అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ నియోజకవర్గ అధ్యక్షులు పృథ్వీరాజ్, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ,మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు జీర్గల్ నగేష్ మాదిగ,మాల మహానాడు జిల్లా అధ్యక్షులు, టిఎస్ ఎమ్మార్పీఎస్ నాయకులు బొప్పల్లి వెంకటేష్, నారాయణ, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఉప్పరపల్లి బాలకృష్ణ, ముడుమల్ గ్రామస్తులు నాగప్ప, మారెప్ప కే ఎన్ పీ ఎస్ కార్యకర్త, దాసరి వెంకటప్ప, తిమ్మప్ప,కృష్ణ,ఓబ్లేష్, లక్ష్మణ్,తిరుమలేష్, అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ క్రియశీలక సభ్యులు తల్వార్ నరేష్, రవికుమార్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మరికల్ ఎంపీడీవోగా కొండన్న

నవ తెలంగాణ – మరికల్

మరికల్ మండల నూతన ఎంపీడీవో కొండన్న గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఊట్కూరు సూపరింటెండెంట్‌గా నిర్వహించారు. ప్రస్తుత మరికల్ మండలం ఎంపీడీవోగా ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు. మరికల్ మండలానికి బదిలీగా ఎంపీడీవో కొండన్న వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎంపీడీవో ఇన్చార్జిగా ఎంపీడీవో, ఎంపీఓగా పావని నిధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని సమస్యలు పరిష్కరించడానికి ప్రతి ఒక్కరూ గ్రామ, మండల ప్రజలు, ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువచ్చి సామరస్యంగా పరిష్కరి ంచుకోవాలని అన్నారు. మరికల్ ఎంపీడీవో, కార్యాల, గ్రామ పంచాయతీ సెక్రటరీలు, సిబ్బంది నూతన ఎంపీడీవోను శాలువాతో ఘనంగా సన్మానించారు.



జాతీయ విపత్తుగా ప్రకటించాలి

• సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవీ రమణ



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

తెలంగాణ రాష్ట్రంలో వచ్చిన వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహకారాన్ని అందించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవీ రమణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయంలో వీ.వీ నరసింహ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వచ్చిన వరదల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రాణ, ఆస్తి నష్టం జరిగాయనీ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. వరదల వచ్చిన వెంటనే గుజరాత్‌కు ఆగ మేఘాల మీద కేంద్ర బృందాన్ని పంపిందని, అదే న్యాయం మిగతా రాష్ట్రాలకు ఎందుకు చేయడం లేదని బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఒకరకమైన న్యాయం, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు ఇంకొక న్యాయం చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ కేంద్ర నాయకత్వాన్ని నిలదీసి ఎందుకు నిధులు తీసుకరావడం లేదో అర్థం కావడం లేదన్నారు. అకాల వర్షాల వల్ల రైతాంగం పంటలను నష్టపోయిందని, ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. వర్షాల వల్ల మరణించిన ఒక్కొక్కరికీ రూ. 10 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియ చెల్లించాలని, కూలిపోయిన ఇళ్లకు, చనిపోయిన పశువులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయని ప్రభుత్వ ఆసుపత్రులలో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది మందులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని, ఇదే అదనుగా ప్రైవేట్ హాస్పిటల్‌లో విచ్చలవిడిగా రోగుల నుంచి డబ్బులను వసూలు చేస్తున్నాయని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాలలోని అపరిశుభ్ర వాతావరణం కలుషిత తాగునీటి వల్ల పూర్తిస్థాయిలో డ్రైనేజీల నిర్మాణం చేపట్టకపోవడంతో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి ప్రత్యేక నిధులు ,నియామకాల ద్వారా శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోనీ ఎస్సీ గురుకులాలలో పార్ట్ టైం గా పని చేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల అక్రమ తొలగింపులను తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని అన్నారు. రాష్ట్రంలో గురుకుల పాఠశాలల ప్రారంభమైనప్పటి నుంచి వారి సేవలను వినియోగించుకొని వారినీ అర్ధాంతరంగా తొలగించడం సరి కాదన్నారు. తక్షణమే వారిని విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఏ వెంకటస్వామి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోనీ దౌదర్ పల్లి లో విద్యుత్ వైర్ల షాట్ సర్క్యూట్ తో ఎద్దు మేక మరణించాయని ,10వ వార్డులో ఇళ్ళు కూలిపోయాయని, అదే విధంగా ప్రధాన ప్రాజెక్టులు రిజర్వాయర్‌ల కింద ధ్వంసమైన కాలువలకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇలా జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో వర్షాల వల్ల నష్టపోయిన బాధితులను తక్షణమే జిల్లా అధికార యంత్రాంగం పరామర్శించి సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు రేపల్లె దేవదాసు, పరం జ్యోతి, జి.రాజు , నర్మద , ఉప్పేర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

దళిత జర్నలిస్ట్ ఫారం ..

రాష్ట్ర చైతన్య సభ కరపత్రాల ఆవిష్కరణ



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల/గట్టు

దళిత జర్నలిస్ట్ ఫారం ఆధ్వర్యంలో ఈనెల 27న జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర చైతన్య మహాసభ హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఏర్పాటు చేశారు. అందుకు సంబంధించిన కరపత్రాన్ని దళిత జర్నలిస్టు ఫోరం వ్యవస్థాపకులు కాశపోగు జాన్ ఆధ్వర్యంలో గురువారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో కరపత్రాన్ని ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనే దళిత జర్న లిస్టుల ఫోరం ఏర్పడడం చాలా సంతోషకరమని అన్నారు అదేవిధంగా దళిత జర్నలిస్టులు చాలామంది జర్నలిస్టులు ఉన్నారు వారిని అన్ని రకాల ఆదుకుంటామని ఆయన అన్నారు ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కాశపోగు జాను మాట్లాడుతూ హైదరాబాదులో రవీంద్రభారతిలో జరిగే రాష్ట్ర చైతన్య సభలకు 27న జరిగే రాష్ట్ర చైతన్య సభకు ప్రతి ఒక్క దళిత జర్నలిస్టులు పాల్గొని ఇట్టి సభను సమావేశమును హాజరై విజయవంతం చేయాలని ఆయన ఒక పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు జోగుళాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు డీ. వెంకటన్న, శాంతిరాజు, తాటికుంట తిరుమల్, ఎస్ తిరుమలేష్, మన్న పురం రాముడు, సురేష్, కిరణ్ కుమార్ నాయకులు మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, పిడిఎస్యు రాజు, థరూర్ రామన్న, ధర్మ నాయుడు, గోవిందు, భగీరథ వంశీ , ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ బండారి భాస్కర్ , ఎంపీపీ గట్టు విజయ్ యూత్ నాయకులు గోవిందు పిడిఎస్ రాజు రాష్ట్ర అధ్యక్షులు కాశపోగు జాను జిల్లా అధ్యక్షులు వెంకటన్న తిరుమల రాములు తిరుమలేష్. శాంతన్న తదితరులు పాల్గొన్నారు.

తప్పెట్లమొర్సులో పశు వైద్య శిబిరం



నవతెలంగాణ - గట్టు

మండలంలోని తప్పెట్లమొర్సు గ్రామంలో సమగ్ర గ్రామీణ అభివృద్ధి ఐ వీ డీ పీ లో భాగంగా ఎల్ టీ ఐ మినీ ట్ర సహకారంతో భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 89 పశువులకు వైద్య పరీక్షలు చేసి వాక్సినేషన్ చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సర్జన్ డాక్టర్ శంకర్ వెటర్నరీ అసిస్టెంట్ పృధ్వి రావు,కనకరాజు, అటెండర్ కాజా,గోపాల్ మిత్ర ,ఉరుకుందు, నాయుడు భవిష్య భారత్ సిబ్బంది లైవ్లిహుడ్ ఆఫీసర్స్ వెంకటేశ్వర్లు, హరికృష్ణ, కమ్యూనిటీ ఆర్గనైజర్ పరమేష్ ఆచారి, రైతులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న మాజీ సర్పంచ్



నవతెలంగాణ - మల్దకల్

మండలపరిధిలోని మద్దెల బండ గ్రామ ప్రజలకు, పెద్దమనుషులకు ఇచ్చిన మాటను మాజీ సర్పంచ్ కొత్తింటి జయమ్మ నారాయణ నిలుపుకున్నారు. అప్పటి సర్పంచ్ ఎలక్షన్‌లో మాట ఇచ్చిన వ్యక్తి కొత్తింటి జయమ్మ నారా యణ ఇప్పుడు మాట మీద నిలబడి మద్దెలబండ గ్రామ శివారు సర్వే నంబర్24 లో 2.15 గుంటలు భూమిని గురువారం మద్దెలబండ గ్రామ పంచాయతీ వైకుంఠధామం గా నిర్ణయించబడింది. గ్రామ ప్రజలు పెద్ద మనుషులు,కార్యకర్తలు మాజీ సర్పంచ్‌ను ప్రశంసించారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

5

జోగులాంబ-గద్వాల

శుక్రవారం | సెప్టెంబర్ 06, 2024 | www.navatelangana.com

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ..

అదనపు కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

రాష్ట్రవ్యాప్తంగా ఆశావర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు పని భారం తగ్గించి, ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం గద్వాల కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపి అదనపు కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా కార్యదరి వీవీ నరసింహ ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి సునీత మాట్లాడుతూ గత సమ్మె కాల ఒప్పందాల ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు , ఉద్యోగ భద్రత కల్పించే పనిబరం తగ్గించాలని , పీఎఫ్ , ఈఎస్ఐ సౌకర్యాలతో పాటు ఇన్సూరెన్స్ కల్పించాలని అన్నారు. అలాగే జిల్లాలోని ఆశాల సమస్యలు బస్తీ దవఖానాలలో ఆశాలతో ఉడ్చడం క్లీనింగ్ చేయించడం, మెడికల్ కిట్టు ఆశాలతో మోహించడం జరుగుతుందని, వీటిని మినహాయించి ఆరోగ్య సమస్యలు ఉన్నప్పుడు ఆశలకు సెలవులు ఇవ్వాలని అన్నారు. వీటితో పాటు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పద్మ, కాంతమ్మ, కురవపల్లి పద్మ, విజయమ్మ, చెన్నమ్మలతా, సుజాత, మమత, అనసూయ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి : కలెక్టర్, ఎస్పీ



నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని కలెక్టర్ బీ.ఎం సంతోష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎం.ఎ.ఎల్.డీ కళాశాలలో ఉపాధ్యాయుల దినోత్సవ సందర్భంగా యూపీఎస్‌సీ సివిల్ సర్వీసెస్ పరీక్షల ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌కు జిల్లా ఎస్పీ టీ.శ్రీనివాసరావు తో కలిసి కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ సివిల్ సర్వీస్ ఎగ్జామ్స్‌పై ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ముఖ్య ఉద్దేశం విద్యార్థులకు పరీక్షల సిలబస్, ప్రిపరేషన్ పై అవగాహన కల్పించారు. కలెక్టర్ తమ వ్యక్తిగత ,వృత్తి రంగాలలో సొంత అనుభవాలను వివరించారు. ఐఏఎస్ స్థాయికి చేరుకోవాలంటే ప్రతి ఒక్కరిలోనూ నిరంతరం శ్రమ, పట్టుదల, ప్రేరణా ఎంతో కీలకమని అన్నారు. పరీక్షల్లో మంచి ర్యాంక్ సాధించాలంటే కేవలం ఒక రోజు మాత్రమే కాకుండా ప్రతిరోజూ క్రమంగా చదువుకోవడం అవసరమని అన్నారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని నిర్దేశించి, ఒక ఉద్దేశంతో చదవాలని అన్నారు. సిలబస్, మోడల్ పేపర్లు, బేసిక్స్ , న్యూస్ పేపర్ వీటి దృష్ట్యా పరిక్షలకు సిద్ధం అవ్వాలని అన్నారు. హార్డ్ వర్క్ తో పాటు స్మార్ట్ వర్క్ కూడా ప్రాధాన్యం కలిగి ఉండలాని, ఆన్లైన్ క్లాసులు, గ్రూప్ స్టడీ ద్వారానాలెడ్జ్ పెంపొందించుకోవడం అవసరమని అన్నారు. గ్రూప్ వారిగా సబ్జెక్టులను చదవడం, డిస్కస్ చేయడం వల్ల టైమ్ సేవ్ చేయడమే కాకుండా, మెరుగైన ఫలితాలు సాధించడానికి దోహదపడుతుందని అన్నారు. ఎస్పీ టి.శ్రీనివాస రావు మాట్లాడుతూ తమ వృత్తి అనుభవాలను పంచుకుంటూ,యువతకు స్ఫూర్తి కల్పిస్తూ,కఠిన శ్రమతో కూడిన ప్రణాళికను పాటిస్తే తప్పకుండా విజయాలు సాధించగలమని అన్నారు. హైదరాబాద్‌లో మాత్రమే కాదు, గద్వాలలో కూడా సివిల్స్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులకు మంచి కోచింగ్ క్లాసులు అందిస్తామని తెలిపారు. ఏదైనా చేయగలమనే ఆత్మవిశ్వాసం, నమ్మకం ఉండాలాని, నీలో ఉన్న బద్ధకాన్ని, అపనమ్మకాన్ని నా వల్ల కాదు అని ఆలోచనలను తీసి వేసి చక్కటి ప్రణాళిక చేసుకొని చదివితే ఇతరులకు ఆదర్శంగా నిలవగలమని అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఒక మంచి నిర్ణయం తీసుకొని ఉన్నత లక్షణాలు వైపు వెళ్లాలని కోరారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా యువతులకు గొప్ప అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం డ్రగ్స్ వల్ల జరిగే దుష్ఫలితాల, షీ టీం పోస్టర్స్, ట్రాఫిక్ నియమాల పోస్టర్స్ కలెక్టర్‌తో కలసి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్.కాలందర్ భాష, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ప్రియాంక,ఈ.డీ ఎస్.సీ రమేష్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ చంద్ర మోహన్, అధ్యాపకులు,విద్యార్థులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం : కలెక్టర్



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

విద్యార్థుల అభివృద్ధి, భవిష్యత్తు సాధనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కలెక్టర్ బీ.ఎం. సంతోష్ అన్నారు. గురువారం ఉపాధ్యాయుల దినోత్సవంలో భాగంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని అనంత ఫంక్షనల్ హాల్‌లో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి కలెక్టర్, గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ



చిన్నప్పటి నుంచి పెద్దయ్య వరకు విద్యార్థి వ్యక్తిత్వం, అభివృద్ధి, భవిష్యత్తు సాధనలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. గద్వాల ప్రాంతంలో ఉపాధ్యా యులు అందిస్తున్న సేవలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నేటి కాలంలో ఉపాధ్యాయులు కొత్త టెక్నాలజీని ఉపయోగించి విద్యను అందించడం అవసరమని స్పష్టం చేశారు. ప్రతి టీచర్ 5 మంది విద్యార్థులను అడాప్ట్ చేసుకొని మోటివేట్ చేసి వాళ్ళను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. టీచర్ ప్రవర్తనను బట్టి పిల్లల ప్రవర్తన ఉంటుందని , ఉపాధ్యాయులు ఉన్నతంగా ఉంటూ పిల్లలకి చదువుతోపాటు, ఫిజికల్ ఎడ్యుకేషన్ కూడా ఇవ్వాలని అన్నారు. గద్వాల్ శాసనసభ్యులు స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కింద గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్ కు రూ.60 లక్షలు, గవర్నమెంట్ గర్ల్స్ జూనియర్ కాలేజ్ కి రూ.75 లక్షలు, జెడ్పీహెచ్ఎస్ రేవులపల్లికి రూ. 50 లక్షలు, ఎంపీపీఎస్ బురెడ్డిపల్లికి రూ.30 లక్షలు నిధులు వెచ్చించినట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం గద్వాల్ శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి రంగానికి ఒక గురువు ఉంటారని , అన్ని రంగాల్లో ఉన్నతంగా అభివృద్ధి చెందడానికి గురువుల తోడ్పాటు అవసరమని అన్నారు. మనకు తల్లి జన్మనిచ్చిన మిగిలిన జీవితం అంత గురువు నుంచి అభివృద్ధి జరుగుతుందని అన్నారు. మీ కృషి ద్వారా ఈ జిల్లాకు మంచిపేరు తీసుకురావలని తెలిపారు. గద్వాల్ జిల్లాలో 53 మంది ఉత్తమ ఉపాధ్యాయులగా ఎంపిక చేసిన వారిని కలెక్టర్, గద్వాల్ శాసనసభ్యులు ,అదనపు కలెక్టర్ ప్రశంస పత్రం , మెమెంటో , శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగా రావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - గట్టు

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కలెక్టర్ బీ. ఎం సంతోష్,ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,గట్టు మాజీ ఎంపీపీ విజయ్ స్వామి చేతుల మీదుగా అందుకున్న గట్టు మండలం ముచ్చోని పల్లి గ్రామం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం రామాంజనేయులు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంపై యూటీఎఫ్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు . జోగులాంబ గద్వాల జిల్లాలో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో బోధిస్తున్న వారిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. గట్టు మండలం ముచ్చోనిపల్లి గ్రామం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఎం. రామాంజనేయులును ఉపాధ్యాయ వృత్తిలో నిబద్ధత కనబరిచి అంకితభావంతో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి విశిష్ట సేవలను అందించిన వారిగా గుర్తిస్తూ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా "జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం" ప్రదానం చేస్తూ ప్రశంసాపత్రం, జ్ఞాపికతో సన్మానించారు. ఈ నేపథ్యంలో 20 ఏళ్లుగా తన దైన శైలీలో విద్యార్థులకు పోటీ పరీక్షల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తూ వారి సమగ్ర మూర్తిమత్వ వికాసానికి కృషి చేశారని తోటి ఉపాధ్యాయులు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిప్పన్న, స్థాన కార్యదర్శి గోపాల్ , నాయకులు తదితరులు అభినందించారు. అనం తరం ఆయా కేటగిరీలలో కలిపి మొత్తం 51 మందిని ఎంపిక చేసినట్లు జిల్లా అధికారి రవీందర్ తెలిపారు. వీరికి గురువారం కలెక్టర్ బీ.ఎం సంతోష్, స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో అవార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

కస్తూర్బాగాంధీ పాఠశాలలో..

గట్టు మండల కేంద్రంలోని కస్తూబా గాంధీ పాఠశాలలోని ప్రిన్సిపాల్ గోపీనాథ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వారంలో మూడు రోజులు సదరం క్యాంప్

నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి మంగళ, బుధ, శుక్రవారాల్లో సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నర్సింగరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల వికలాంగులు మొదట మీసేవ కేంద్రాలలో ఈనెల ఆఖరి వరకు సదరం స్లాట్ బుకింగ్ చేసుకోవాలని తర్వాత సర్టిఫికెట్స్ కొత్తవి/ రెన్యువల్ చేసుకోవడానికి వీలవుతుందని అన్నారు. నిర్ణయించిన తేదీల ప్రకారం ప్రభుత్వ హాస్పిటల్ నందు హాజరు కావాల్సిందిగా కోరారు. ఈనెల 10, 17, 24 తేదీలలో కంటి వికలత్వం గల వారికి 11, 18, 25 తేదీలలో శారీరక వికలత్వం గల వారికి, 12 , 19, 26 తేదీలలో శారీరక, మానసిక వికలత్వం గల వారికి 13 , 20, 27 తేదీలలో చెవిటి, మూగ వికలత్వం గలవారికి ఈ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మరియు హాజరైన వారికి అదే రోజు సదరం సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.


తిమ్మప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ - మల్దకల్

మండల కేంద్రంలోని స్వయంభు మల్దకల్ తిమ్మప్ప స్వామిని ఐఏఎస్ గిరిజాశంకర్ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీరుస్తూ భక్తుల కొంగు బంగారంగా నిలిచిన ఆదిశిలావాసుడు మల్దకల్ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్గా పనిచేసి.. ప్రస్తుతం విజయవాడ జిల్లా కలెక్టర్గా పని చేస్తున్న గిరిజా శంకర్ సతీసమేతంగా మల్దకల్ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి తిమ్మప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారి శేష వస్త్రం చిత్రపటం కలెక్టర్‌కు బహుకరించారు.

వైద్య శిబిరం విజయవంతం



నవతెలంగాణ - గట్టు

మండలంలోని చిన్నోనిపల్లి గ్రామంలో ఎస్బీఐ ఫౌండేషన్ , భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ క్యాంపులో జనరల్ డాక్టర్ (బి.పి/ షుగర్) ఉచితంగా వైద్య పరీక్షలు , రక్త పరీక్షలు చేశారు. దాదాపు 200 పైగా వైద్య పరీక్షలు నిర్వహించినట్లు భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ డాక్టర్ నరసింహులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి , లాబ్ టెక్నీషియన్ విష్ణు , ఆపరేటర్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతకు నిలయాలుగా.. అంగన్వాడీ కేంద్రాలు

గట్టు : మండల కేంద్రంలోని 1వ అంగన్ వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ విద్య కార్యక్రమాలను సీడీపీఓ నాగరాణి గురువారం పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు.. మల్దకల్ ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో సెప్టెం బర్ 1 నుంచి అంగన్వాడీ కేంద్రా లలోని చిన్నారు లకు పూర్వ ప్రాథమిక విద్య నైపుణ్యాలను నేర్పిస్తూ... పిల్లలలో వర్ణమాల, అంకెలు , ఆల్ఫాబెట్స్ చదవడం , రాయడం, పలికించడం, గుర్తు పట్టడం వంటి పూర్వ ప్రాథమిక విద్య నైపుణ్యాలను మెరుగుపరిచేలా అంగన్వాడీ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ చూపా లని సూచించారు. పిల్లల తల్లిదండ్రులకు కూడా ప్రీ స్కూల్ ప్రాముఖ్యతను తెలియ చేస్తూ కేంద్రంలోని ప్లే మెటీరియల్‌పై వివరిస్తూ చిన్నారుల విద్య కై పాటిస్తున్న విధానాలను తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్వాడి కేంద్రాలలో చిన్నారుల హాజరు శాతం పెంచాలని ఆదేశించారు. అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేయించి, చేతుల పరిశుభ్రత విధానాలను పిల్లలచే చేయిం చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సంధ్యరాణి, అంగన్వాడీ టీచర్ వెంకట్రా వమ్మ , చిన్నారులు , కిషోర్ బాలికలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



అందుబాటులో మందులు

• డీఎంహెచ్ఓ సిద్ధప్ప



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు అందుబాటులో మందులు ఉన్నాయని వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. ఎస్కే .సిద్ధప్ప తెలిపారు. జోగు లాంబ గద్వాల జిల్లా పరిధిలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, జిల్లా ఆసుపత్రిలో కుక్క కాటుకు, పాము కాటుకు, తేలు కరచినచో, అవసరమైన వ్యాక్సిన్లు, ఇంజక్షన్లు, మెడిసిన్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలో ఎవరికైనా కుక్క కరిచిన, పాము కరిచిన, లేదా తేలు కుట్టినచో దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా జిల్లా ఆస్పత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించి తొందరగా చికిత్స చేసుకోవాలని సూచించారు. వైద్యం కోసం మంత్రగాలను, భూతవైద్యులను, నాటు వైద్యుల, దగ్గరికి వెళ్లి ప్రాణం మీదకు తెచ్చుకోవద్దని జిల్లా ప్రజలకు సూచించారు.